

ఓటే ఆయుధం! 6

బరిలో వీరే.. 8

నేడు ఓటెత్తండి!



ఈవీఎం మిషన్‌పై సిబ్బందికి అవగాహన

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మీ ఓటే వజ్రాయుధం.. ఒక్కసారి నొక్కితే ఐదేళ్లు మిమ్మల్ని పాలించే అవకాశం..ఆ అవకాశాన్ని జారవిడుచుకోవొద్దు..మీ తెగువ చూపండి.. మీకు నచ్చిన.. మీరు మెచ్చిన అభ్యర్థిని ఎన్నుకోండి..ప్రజల కోసం.. ప్రజల చేత.. ప్రజలే ఎన్నుకొనే ప్రభుత్వ విధానమే ప్రజాస్వామ్యం. దీనినే ఆంగ్లంలో డెమోక్రసీ అంటారు. ఇది డెమోక్రటియా అనే గ్రీకు పదం నుంచి వచ్చింది. డెమోస్ అంటే ప్రజలు.. క్రాటోస్ అంటే పరిపాలన అని అర్థం. 'అందరూ స్వాతంత్ర్యం అనుభవించడం, ప్రతి ఒక్కరూ సమానం' ఇవి ప్రజాస్వామ్య ముఖ్య నియమాలు. మరి ఇవి నెరవేరాలంటే ఒకే ఆయుధం 'ఓటు'. ఈ హక్కు వినియోగించుకునే రోజే 'పోలింగ్ రోజు (ఈరోజు). అయితే అంతటి విలువైన ఓటుపై నిర్లక్షంగా వ్యవహరిస్తూ ఐదేళ్ల పాటు ఇబ్బందులకు గురవుతున్నారు.పాలకులను ఎన్నుకునే అవకాశాన్ని జార విడుచుకొని బేజారవుతున్నారు.నోట్లు, బహుమతులు వంటి వాటి కి లొంగి అనుభవం లేని వాళ్లను, దగా కోర్లను నెత్తిన ఎక్కించుకొని నలిగిపోతున్నారు.దీనికి ఈ సారి స్వస్తి పలుకుదాం.ఓటుపై అలిగితే రాజ్యాంగం

ఉదయం 7 గంటల నుంచే పోలింగ్



ఇచ్చిన మహత్తర అవకాశాన్ని జార విడుస్తున్నట్టే. లెగండి.. పదండి..ఓటెత్తండి. మన ఆకాంక్షలను నెరవేర్చే నాయకులను పాలకులుగాచేసుకుందాం. మరో ఐదేళ్లు యాతన పడకుండా జాగ్రత్త పడదాం.ప్రజాస్వామ్యం ఓడిపోకుండా ఓటుతో కాపాడుకుందాం.

2014,2019 ఎన్నికల్లో పోలింగ్

నియోజకవర్గం	2014	2019
రాజమహేంద్రవరం సిటీ	69.47	66.19
రాజమహేంద్రవరం రూరల్	73.97	74.21
కొవ్వూరు	85.28	86.46
నిడదవోలు	85.72	82.70
గోపాలపురం	86.96	85.92
అనపర్తి	85.98	87.44
రాజానగరం	85.93	87.83
సరాసరి	81.90	81.53

వారి తీరు గర్హనీయం



జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలైన రాజమహేంద్రవరం సిటీ, రూరల్, రాజానగరం, అనపర్తి, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురంలో గత రెండు దఫాల్లో(2014, 2019) ఓటింగ్ 90 శాతం దాటలేదు.సరాసరి చూస్తే 2014లో 81.90 శాతం, 2019లో 81.53 శాతం మాత్రమే ఓటింగ్ నమోదైంది. ఓటు వేయని సు మారు 18 శాతం మంది ఇంటికే పరి మితమయ్యారు. పోలింగ్ రోజున ఓటు వేయడా నికి ఎన్నికల సం ఘం అన్ని ఏర్పాట్లూ చేస్తోంది. కానీ లక్షల మంది ఓటింగ్‌కి దూ రమై ప్రజాస్వామ్యాన్ని అప హాస్యం చేస్తున్నారనడంలో సందే హం లేదు. జిల్లాలోని రాజమ హేంద్రవరం సిటీ నియోజకవర్గ ప్రజలు మే ల్కోవాల్సిన అవసరం కనిపిస్తోంది. గత రెండు దఫాల ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో ఇక్క డే అతి తక్కువ ఓటింగ్ నమోదైంది. గ్రా మా ల్లో ప్రజలు చైతన్యంతో ఉంటే నగర ప్రజలు ఓటు చులకనగా చూస్తున్నారనే వాదన ఉంది.

ప్రతి ఒక్కరూ ఓటెయ్యాలి : కలెక్టర్

ఓటేయడం మన సామాజిక బాధ్యత. నేనూ ఓటేస్తున్నా. కంబాలపేటలోని ఆనందరీజెన్సీ ఎదురుగా ఉన్న చున్నీ లాల్ జాజు రోటరీ మునిసిపల్ కార్పొ రేషన్ స్కూల్‌లో నాకు ఓటు ఉంది. ఎన్నికలనేవి ప్రజాస్వామ్య పండుగ. సోమవారం ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాల యాలన్నింటికీ సెలవు.ప్రతి ఒక్కరూ ఓటెయ్యాలి. పోలింగ్ ముగిసే సమ యానికి క్యూలో ఉన్న ఓటర్లందరికీ ఓటు వేయడానికి అనుమతి ఉంటుం ది.జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంది. పోలింగ్ కేంద్రాల్లో మొబైల్ ఫోన్లు నిషేధించాం. శనివారం నుంచి సోమవారం సాయంత్రం వరకూ 48 గంటలు ఎక్కడా మద్యం అమ్మకాలు లేకుండా నిషేధించాం. జిల్లాలో 164 ప్రాంతాల్లో 375 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో 434 మంది మైక్రో అబ్జర్వర్లు, 151 మంది సెక్టార్ అధికారులు, 151 రూట్ అధికారులు ఉన్నారు.24 ఎంసీసీ బృందాలు, 67 మంది ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 69 గణాంకాల బృందాలు 24 వీడియో సర్వేలెన్స్ బృందాలు, 25 వీడియో చిత్రీకరణ బృందాలు, 16 అకౌంటింగ్ బృందాలు ఉన్నాయి. ఏ సమస్య తలెత్తినా జిల్లా కంట్రోలు రూమ్ 18904252540 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలి.. ఓటర్ల సమాచారానికి 1950 నెంబరులో సంప్రదించవచ్చు. ఓటర్లు 12 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించి ఓటేయవచ్చు.

పక్కాగా బందోబస్తు : ఎస్పీ జగదీశ్

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఎన్నికలకు రెండు నెలల ముందు నుంచే సన్నద్ధత మొదలుపెట్టాం.పక్కా ప్రణాళికతో బందోబస్తు ఏర్పాట్లు చేశాం. శాంతియుతంగా పోలింగ్ జరగడానికి అన్ని ఏర్పాట్లూ చేశాం.. సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులు పెట్టి ఇప్పటి వరకూ రూ.23 కోట్ల విలువ చేసే బంగారం, నగదు, మద్యం, ఫ్రీబీస్‌ను సీజ్ చేశాం. ఓటరుకు రక్షణ అవసరమైతే ప్రత్యే కంగా ఏర్పాటు చేసిన పోలీస్ కంట్రోల్ రూం నెం.0883 2441480కి లేదా డయల్ 100, 112కి ఫోన్ చేస్తే నిమిషాల్లో వారి వద్దకు చేరుకుంటాం. లేదా దగ్గరలోని పోలీసులను సంప్రదించాలి. జిల్లాలో 1700 మంది పోలీసులు, 10 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలతో భద్రత ఏర్పాట్లు చేశాం.ఇప్పటికే 1098 మంది రౌడీషీటర్లను, 173 మంది గత ఎన్నికల్లో నిందితులు /నేరస్తులను బైండోవర్ చేశాం. 178 లైసెన్సుడు వెపన్స్ స్వాధీనం చేసుకున్నాం.నేను 2017 బ్యాచ్ ఐపీఎస్.ఎస్పీగా సార్వత్రిక ఎన్నికల్లో ఒక జిల్లా బాధ్యతలు చూడడం తొలిసారి. మా అధికారులు, సిబ్బందితో పూర్తి సమన్వయంతో ఎన్నికలకు సన్నద్ధమయ్యాం.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. సోమ వారం ఉదయం 7 గంటల నుంచి సాయం త్రం 6 గంటల వరకూ పోలింగ్ జరగనుంది. ఈ మేరకు 1577 పోలింగ్ కేంద్రాలు ఏర్పా టు చేశారు. ఏడు నియోజకవర్గాల్లో 71 మంది పోటీపడుతున్నారు. ఎంపీ అభ్యర్థులు 12 మంది బరిలో ఉన్నారు. ఇప్పటికే జిల్లాలో 16,169 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేశారు. జిల్లాలో మొత్తం 16,23,149 మంది ఓటర్లు ఉన్నారు. మహిళలు 8,30,735 మంది ఉండగా, పురుషులు 7,92,317 మంది, ఇతరులు 97 మంది ఉన్నారు. వీరిలో పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు, హోం ఓటింగ్‌ను మినహాయిస్తే మిగతా వారంతా ఓటు వేయవలసి ఉంది. కొత్తగా ఓటు హక్కు పొందిన యువత 40,509 మంది ఉన్నారు. సోమవారం ఉదయం 5.30 గంటలకే మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. ఇది రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో అధికారులు నిర్వహిస్తారు. ప్రతి రెండు గంటలకు పోలింగైన ఓట్ల శాతాలు ప్రకటిస్తారు. పీడీఎంఎస్ యాప్ ద్వారా పీవో, ఏపీవోలు ప్రతి రెండుగంటలకు పోలింగ్ శాతాలు అప్‌లోడ్ చేస్తారు.

ఎన్నికల పండుగ నేడే. పాలకులకు అప్పగించిన బాధ్యతను నెరవేర్చారో లేదో ప్రజలు తేల్చేసే సమయమిది. ప్రజాస్వామ్య దేశంలో ఓటు ఓ పాశుపతాస్త్రం. నచ్చని నేతను ఇంటిదారి పట్టించొచ్చు. నచ్చిన నేతను అధికార పీఠంపై కూర్చోబెట్టొచ్చు. అయిదేళ్లకోసారి ప్రజలకు ఈ అవకాశం వచ్చేదే. ఈసారి కూడా తమ అమూల్యమైన ఓటు ద్వారా తీర్పు చెప్పాల్సిన తరుణమొచ్చింది. గడిచిన అయిదేళ్లుగా అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం మంచి చేసిందా, ముంచిందా అనేది ఓటర్లు ఇప్పటికే ఓ నిర్ధారణకు వచ్చేసి ఉంటారు. ప్రతిపక్షంలో ఉన్న కూటమి పార్టీలు ఈ అయిదేళ్లూ ప్రజల పక్షాన నిలబడి పోరాడాయా లేదా అన్నది కూడా ఓటర్లు బేరీజు వేసుకుంటారు. రాష్ట్ర ప్రభుత్వంపై అనుకూలత, వ్యతిరేకత.. ఆయా పార్టీల అధినేతలపై విశ్వసనీయత, సమర్థత ఓటర్లను ప్రధానంగా ఆలోచింపజేస్తాయి. ఈ అంశాలను పరిశీలిస్తే వైసీపీ ప్రభుత్వంపై అనుకూల వైఖరికంటే వ్యతిరేకతే అధికంగా నెలకొన్నట్టు అనేక సంఘటనలు రుజువు చేస్తున్నాయి.

ఓటే ఆయుధం



కాకినాడ/రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి) :



- ఓటు విలువే.. మన భవిష్యత్తు
- ఆలోచించి ఎన్నుకోవాల్సిన తరుణమిది
- బటన్ నొక్కుడేనా.. సంక్షేమంతో పాటు అభివృద్ధా
- సమర్థత కలిగిన సీఎం ఉంటేనే రాష్ట్ర ప్రగతి
- తాయిలాలకు ఓటేస్తే మరో ఐదేళ్లూ చీకటే



పాలనలో సంక్షేమానికి ఇచ్చిన ప్రాధాన్యం అభివృద్ధికి ఇవ్వకపోవడం ప్రధానలోపంగా పలువురు చెబుతున్నారు. దీంతో ఈ అయిదేళ్లూ అభివృద్ధి పూర్తిగా పడకేసింది. బటన్ నొక్కడం ద్వారా మంచి చేశానని చెప్పడమే తప్ప మరొకమార్గం అధికార పార్టీ నేతలకు లేకుండా పోయింది. ఇక అధినేతల విశ్వసనీయత, సమర్థతలోనూ సీఎం జగన్ కనీస మార్కులు సంపాదించుకోలేకపోయారు. అనేక వర్గాలకు ఇచ్చిన హామీలను పట్టించుకోకపోవడంతో పాటు అభివృద్ధికి దోహదం చేసే పారిశ్రామికరంగాన్ని పూర్తిగా వదిలివేయడం జగన్ అసమర్థతను చాటింది. ఇక గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల విషయానికొస్తే.. 99 శాతం హామీలను తాము నిలబెట్టుకున్నామని జగన్, వైసీపీ నేతలు చెప్పడాన్ని ప్రతి ఒక్కరూ నిలదీస్తున్నారు. ఉద్యోగ వర్గాలకు ఇచ్చిన సీపీఎస్ రద్దు హామీ దగ్గర నుంచి యువతకు ఉద్యోగాల హామీ, మద్య నిషేధంతో మహిళలకు మంచి చేస్తామని చెప్పి అంతకు రెట్టింపు స్థాయిలో మద్యం వ్యాపారాన్ని విస్తరించడం వరకు ప్రజలు ప్రస్తావిస్తున్నారు. కీలకమైన హామీల జోలికి వెళ్లకుండా కేవలం పేదవర్గాలకు సొమ్ములు వేస్తున్నామని, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగాలు కల్పించామని కల్లబొల్లి కబుర్లు చెబుతూ ఏమార్చడాన్ని తీవ్రంగా వ్యతిరేస్తున్నారు. పేదలకు ఇచ్చిన పథకాల్లోనూ అనర్హుల పేరుతో వేటువేసి, ఎగవేసిన వారికి మళ్లీ మంజూరు చేయడానికి నాలుగైదు నెలలు అధికారుల చుట్టూ తిప్పించుకున్న వైనాలను వందలాది మంది బయటపెడుతున్నారు. ఏది ప్రశ్నిస్తే ఏ పథకం ఆపేస్తారోనన్న భయాందోళనతో ఈ అయిదేళ్లూ గడిచిందని పలువురు తమ ఆవేదనను వెళ్లబుచ్చుతున్నారు. తమ అభిప్రాయాన్ని వెల్లడించడానికి ఇదే సరైన సమయమని వారు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు హైదరాబాద్ స్థాయిలో ఒక రాజధాని ఉండాలని ప్రతిఒక్కరూ ఆశించారు. 2014 తర్వాత అప్పటి ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత అమరావతి నగరానికి రూపకల్పన చేయడంతో అన్ని ప్రాంతాలవారూ ఆనందించారు. అందరికీ అందుబాటులో ఉండే రాజధానితోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచే అధునాతన నగరంలా అలరారుతుందని కలలుగన్నారు. 2019 ఎన్నికల తర్వాత ఆ కల ఎలా చెదిరిందో ఎవరికీ చెప్పాల్సిన పనిలేదు. మీ రాష్ట్ర రాజధాని ఏంటి అంటే చెప్పలేని దుస్థితి. ఈ అయిదేళ్లలో ఓ అధునాతన రాజధాని నగరంగా అమరావతి రూపుదిద్దుకునేదే. ఇటీవల రాజమండ్రి ఎన్నికల సభకు వచ్చిన ప్రధాని మోదీ స్వయంగా అమరావతి కోసం రూ.15 వేల కోట్లు నిధులు కేటాయించినా వినియోగించుకోలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందని చెప్పారు. రాజకీయ కక్షతో ఒక మహానగరాన్ని నాశనం చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందని అన్ని ప్రాంతాల ప్రజలు వ్యక్తంచేస్తున్న అభిప్రాయం. మూడు రాజధానుల పేరిట అయిదేళ్లూ ఓ తతంగం నడిపి ఏదీ చేయకుండా చేతులెత్తేసిన వైసీపీ ప్రభుత్వంపై అందరూ మండిపడుతున్నారు.

యువత నిర్వీర్యం

ఉద్యోగ, ఉపాధి కల్పనలో పూర్తిగా ప్రభుత్వం చేతులెత్తేయడంతో డిగ్రీ నుంచి ఇంజనీరింగ్ వరకు ఈ అయిదేళ్లలో పూర్తయిన వారెవరూ స్థిరపడలేని దుస్థితిలో కాలం గడుపుతున్నారు. తమ ప్రభుత్వం ఏటా జాబ్ కేలండర్ విడుదల చేస్తుందని జగన్ ఇచ్చిన హామీతో వేలాదిమంది నిరుద్యోగులు వేలాది రూపాయలు చెల్లించి కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందారు. ఏటేటా ఊరించి ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగ యువత పూర్తిగా నష్టపోయింది. కష్టపడి చదువుకుని జీవితంలో స్థిరపడేందుకు యువతకు అయిదేళ్ల కాలంలో ఉద్యోగ అవకాశం కోల్పోవడమంటే ఎంత నష్టపోతారో తెలిసిందే. ఏ కుటుంబంలోని వ్యక్తులైనా తమ పిల్లల భవిష్యత్తు బావుండాలనే కష్టపడుతుంటారు. ఆ అవకాశాలను కల్పించే బాధ్యత పాలకులు తీసుకోవాలి. వైసీపీ ప్రభుత్వం ఆ బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకోవడాన్ని నిరుద్యోగ యువత జీర్ణించుకోలేకపోతున్నారు. చివరకు డీఎస్సీలోనూ జగన్ దగా చేయడాన్ని ప్రశ్నిస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌ను సైబరాబాద్‌గా మార్చిన సంగతులన్నీ తెలిసిందే. ఆ దిశగానే కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలోనూ నైపుణ్య నగరాలను తయారుచేయాలని సంకల్పించారు. విశాఖ, విజయవాడలను సాఫ్ట్‌వేర్ హబ్‌గా చేయడంతోపాటు కియా వంటి సంస్థలను తీసుకొచ్చి ఉద్యోగ అవకాశాలను పెద్దఎత్తున కల్పించే ప్రయత్నాలను చంద్రబాబు మొదలుపెట్టారు. కానీ 2019లో ప్రభుత్వం మారిన తర్వాత ఆ కార్యాచరణ అంతా అటకెక్కింది. కేవలం బటన్ నొక్కుతున్నామనే ప్రచారం తప్ప.. యువతకు అండగా నిలిచే ఏ ప్రయత్నమూ వైసీపీ ప్రభుత్వం చేయలేదు. సరే... ఇదంతా గతం..

ఇప్పుడేంటి మరి..

రేపే ఓటర్లు తీర్పు చెప్పేరోజు. ఎవరు, దేనికి ఓటు చేస్తున్నారనే దానిపై ఇప్పటికే సర్వేలు, అభిప్రాయ సేకరణలు పెద్దఎత్తున సాగాయి. ఎగ్జిట్ పోల్స్‌కు సైతం అనేకమంది సిద్ధమవుతున్నారు. ఈ దశలో ఓటర్ల మనసులో ఏముందోననే ఆందోళన అభ్యర్థుల్లోనూ కనిపిస్తోంది. ఇంతకూ ఏ అంశాలు ఈసారి ప్రభావితం చేసే అవకాశం ఉందని పలువురి ప్రశ్నించినప్పుడు అనేక అంశాలు చర్చకు వస్తున్నాయి. అందులో ప్రధానంగా ప్రస్తుత వైసీపీ ప్రభుత్వ తీరు, ప్రత్యర్థిగా ఉన్న కూటమి ఇచ్చిన హామీలు ప్రధానంగా ప్రజల్లో చర్చనీయాంశం అవుతున్నాయి. వైసీపీ తన మేనిఫెస్టోలో చిన్న మార్పులు చేసి అదే ప్రచారంలో పెట్టింది. పింఛన్లు రూ.3500 చేస్తామని.. అది కూడా 2028, 2029 సంవత్సరాల్లో చెరో రూ.250 చొప్పున ఇస్తామని ప్రకటించింది. కూటమి మేనిఫెస్టోలో అదే అంశాన్ని ప్రస్తావిస్తూ జూలై నెల నుంచి వృద్ధులు, వితంతువులకు రూ.4 వేల పింఛను ఇవ్వడంతోపాటు ఏప్రిల్ నుంచే పెరిగిన పింఛను వర్తింపజేసి జూలైలో ఏకంగా రూ.7 వేలు ఇస్తామని ప్రకటించింది. అలాగే వైసీపీ ప్రభుత్వం గడిచిన అయిదేళ్లలో ఒక్క రూపాయి కూడా దివ్యాంగులకు పెంచకపోగా, తాజా మేనిఫెస్టోలోనూ వారి ప్రస్తావన తేలేదు. కూటమి దివ్యాంగులకు రూ.6 వేల పింఛను ప్రకటించింది. ఇంకా మహిళలకు పథకాలు, యువతకు 20 లక్షల ఉద్యోగాలు, రైతులకు, ఇతర వర్గాల వారికి ఏటా నగదు ఆసరాలను భారీ మొత్తాల్లో కూటమి మేనిఫెస్టో ప్రకటించింది. వైసీపీ పాత పథకాలనే కొనసాగిస్తామని స్పష్టంచేసింది. దీంతో కూటమి మేనిఫెస్టోకు ప్రజల నుంచి పెద్దఎత్తున స్పందన లభించింది. సంక్షేమంతోపాటు అభివృద్ధిని పెద్దపీట వేస్తామని, ఉద్యోగ కల్పన దిశగా రాష్ట్రాభివృద్ధి ఉంటుందని కూటమి చెప్పడంతో చంద్రబాబు పాలనపై అనేకమంది కొత్త ఆశలు పెట్టుకున్నారు. అప్పులు తెచ్చి సంక్షేమం పేరిట సొమ్ములు ఇవ్వడంపై ఇప్పటికే విద్యావంతుల్లో వ్యతిరేకత ఉంది. రాష్ట్ర ఆదాయం పెంచి సంక్షేమానికి పెద్దపీట వేస్తే మంచిదనే అభిప్రాయం ఆయా వర్గాల నుంచి వ్యక్తమవుతోంది.

'గోదావరి' నిరాదరణకు

గోదావరి జిల్లా వ్యవసాయాధారితం. కానీ సాగునీటి సమస్యలు ఈ ఐదేళ్లలో కోకొల్లలు. కాల్వల ఆధునికీరణ లేకపోవడం మరో శాపం. గిట్టుబాటు ధర లేకపోవడం, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్మిన ధాన్యం సొమ్ముల కోసం నెలల తరబడి ఎదురుచూడడం వంటి అంశాలతో వైసీపీ ప్రభుత్వంపై అన్నదాతలు విసిగిపోయారు.



మరోవైపు గోదావరి ఇసుక అక్రమాలతో వైసీపీ నేతలు కోట్లకు పడగలెత్తారు. సామాన్యులకు ఇసుక దొరకక, భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక నరకం చూశారు. మైనింగ్‌పరంగా మట్టి, గ్రావెల్ కొండలను పిల్చిపిప్పి చేసేశారు. ఇళ్ల నిర్మాణం పేరుతో అక్రమాలకు తెరదీశారు. ఈ దోపిడీ, అరాచక ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని పలువురు వ్యాఖ్యానించారు. వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమల్లోకి తేవడంతో గ్రామీణ ప్రజలు ముఖ్యంగా రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉన్నారు.



చార్జీల మోత



ఇంటి పన్నులు మొదలుకొని చెత్త పన్ను వరకూ సామాన్య, మధ్యతరగతి వర్గాలపై వైసీపీ ప్రభుత్వం పెనుభారం మోపింది. కరెంటు చార్జీల సంగతైతే చెప్పాల్సిన పనిలేదు. ట్రూఅప్ చార్జీల పేరిట వేలాది రూపాయల చార్జీలను ఈ అయిదేళ్లలో ప్రభుత్వం జనం నుంచి పిండేసింది. అదేవిధంగా నిత్యావసర సరుకుల ధరలకు ఆకాశాన్నంటాయి. పెట్రోలు, డీజిల్ ధరలు రాష్ట్ర సెస్ అధికంగా పెంచడం వల్ల అన్నివర్గాలపై ఆ భారం పడింది.

అరాచకాలు ఎన్నెన్నో..



అమలాపురం, కాకినాడ, రాజమండ్రి పార్లమెంటు పరిధిలో వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలెన్నో. భూకబ్జాలు, దళితులపై దాడులు లెక్కకు మించి ఉంటాయి. ప్రధానంగా దళిత డ్రైవర్‌ను వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు హత్యచేసి శవాన్ని డోర్ డెలివరీ చేసిన ఘటన సంచలనమైంది. కానీ జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చిన అదే ఎమ్మెల్సీ ఇప్పుడు ఓ అభ్యర్థి గెలుపుకోసం వైసీపీ కేడర్‌ను నడిపిస్తుండడం విశేషం. అలాగే సీతానగరంలో ఓ యువకుడికి వైసీపీ నేతల అండతో పోలీసులు శిరోముండనం చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనానికి దారితీసింది. కొవ్వూరులో ఫ్లెక్సీ వివాదంలో ఇటు వైసీపీ నేతలు, అటు పోలీసుల వేధింపులు తాళలేక దళిత యువకుడు ఆత్మహత్య చేసుకున్నారు. వైసీపీ నేతలు తన పట్టుకోసం, తమకు ఎదురుతిరిగి వారిపైనా దాడులు చేయడం నిత్యకృత్యంగా సాగింది.

'పుట్టి' మునిగిపోతోంది

ఓటుతో ఫ్యాన్‌పై వేటే

- -నేడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కావడంతో జిల్లాలో అధికార వైసీపీ గజగజ
- -వెల్లువెత్తుతున్న ప్రభుత్వ వ్యతిరేకతతో పుట్టిమునుగుతోందని తీవ్రంగా కలవరం
- -ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో ఉద్యోగులంతా అధికారపార్టీకి వ్యతిరేకంగా తీర్పు
- -ఇప్పుడు ఇతర రాష్ట్రాల నుంచి లక్షల్లో ఓటేయడానికి తరలివచ్చిన జిల్లావాసులు
- -వీరంతా ఓటుతో ఫ్యాన్‌ను చితక్కొట్టడం ఖాయమనే అంచనాలతో బెంబేలు
- -వైసీపీ పాలనలో ఉపాధి,ఉద్యోగ అవకాశాల్లేక వీరంతా పక్క రాష్ట్రాలకు వలస
- -ఇప్పుడా ఆ కసంతా ఓటుతో చూపించనుండడంతో ఫ్యాన్ పార్టీ అభ్యర్థుల్లో గుబులు
- -ఐదేళ్ల జగన్ అరాచక పాలనకు ఓటుతో ముగింపు పలకాలంటున్న ప్రజాసంఘాలు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

నేడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కావడంతో జిల్లాలో ఓటరు తీర్పుపై అధికార వైసీపీ తీవ్రంగా కలవరపడుతోంది. వెల్లువెత్తుతోన్న ప్రజావ్యతిరేకతతో నిండా మునిగిపోవడం ఖాయమన్న లెక్కలతో గజగజలాడుతోంది. ఓటరు నాడి ప్రస్ఫుటమైపోవడంతో పుట్టి మునిగిపోవడం ఖాయమనే అంచనాలతో ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్ రూపంలో జిల్లాలో 17వేల మందికిపైగా అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగులు జగన్ సర్కారును ఓటుతో చాచిపెట్టి కొట్టారు. అయిదేళ్ల పాలనతో విసిగిపోయిన తమ ఆగ్రహాన్ని బ్యాలెట్ ఓటుతో ఫ్యాన్‌ను రెక్కలు విరిగేలా చేశారు. దీంతో రాబోయే అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఏవిధంగా ఉండబోతున్నాయో అధికార వైసీపీకి ముందే చాటిచెప్పారు. ఈనేపథ్యంలో ఓటమి అంచున ఉన్న తమ పార్టీకి సోమవారం నాటి పోలింగ్‌లో ప్రజలు సైతం కర్రుకాల్చి వాతపెట్టడం ఖాయమన్న లెక్కలతో గుబులు చెందుతున్నారు. మరోపక్క ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు వరకు జరగనున్న ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగితే ప్రజావ్యతిరేకతతో ఫ్యాన్ రెక్కలు విరగడం ఖాయమన్న ఆందోళన వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులను వెన్నాడుతోంది. జగన్ ప్రభుత్వ పాలనలో అన్ని విధాలా అణచివేత, దోపిడీకి గురైన జనం ఒకవేళ భారీగా పోలింగ్ కేంద్రాలకు తరలివస్తే తమకు మరింత భయంకర ఓటమి తప్పదనే గుబులు ఊపిరాడకుండా చేస్తోంది. బూత్‌ల్లో ఓటింగ్ తగ్గితే తమకు ఎంతోకొంత ఫలితం ఉంటుందనే సాధ్యం కాని లెక్కలు వేసుకుంటోంది. ఇదంతాఒకెత్తయితే ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయడం కోసం కనివినీ ఎరుగని రీతిలో లక్షలాదిమంది వలస ఓటర్లు జిల్లాలో తమ నియోజకవర్గాలకు చేరుకున్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి దాదాపు 14వేల నుంచి 18వేలకు వరకు వలస ఓటర్లు ఆదివారం స్వస్థలాలకు చేరుకున్నారు. ఇంతమంది వలస ఓటర్ల రాకతో అసలు వైసీపీకి ఊపిరాడడం లేదు. వీరంతా హైదరాబాద్, బెంగళూరు,చెన్నై,విదేశాల నుంచి వెల్లువలా రావడం చూసి వైసీపీ నేతలకు కునుకుపట్టడం లేదు. ఉద్యమం తరహాలో అంతమంది ఓటు వేయడానికి రావడం చూసి తలపట్టుకుంటున్నారు. వలస ఓటర్ల భారీ రాక ప్రభుత్వ వ్యతిరేక ఓటుకు నిదర్శనం కాబోతోందనే అంచనాలు వీరికి నిద్రలేకుండా చేస్తోంది. ఈనేపథ్యంలో ఏ కోణంలో చూసినా అధికార వైసీపీకి అనుకూల ఓటు కనిపించడం లేదు. కాగా జగన్ అయిదేళ్ల పాలనలో జిల్లాలోను,రాష్ట్రంలో నిరుద్యోగ యువత, కార్మికులకు కనీస ఉపాధి అవకాశాలు దక్కలేదు. దీంతో వారంతా ఉద్యోగ,ఉపాధి అవకాశాల కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారు. తమకు ఉపాధిలేకుండా వలస కూలీలుగా మార్చిన జగన్ ప్రభుత్వంపై ఓటుతో గుణపాఠం చెప్పేలా తీర్పు ఇవ్వాలనే కసి ఇప్పుడు వీరిలో కనిపిస్తోంది. విధ్వంసకర పాలనకు ముగింపు పలికి ప్రజారంజక పాలన అందిస్తామన్న కూటమి వైపు వీరంతా మొగ్గుచూపుతారనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో వీరందరికి డబ్బు, మద్యం ఎర వేసే ప్రయత్నం చేసినా కళ్లముందు కదలాడుతోన్న ఓటమి సంకేతాలు వైసీపీ అభ్యర్థులకు ఏమాత్రం మింగుడుపడడం లేదు.

మోడల్ పోలింగ్ స్టేషన్లు

పిఠాపురం, మే 12: పిఠాపురం నియోజకవర్గంలో పలు చోట్ల ఓటర్లను ఆకట్టుకునేలా పోలింగ్ కేంద్రాలను తీర్చిదిద్దారు. పిఠాపురం పట్టణంలోని పాతబస్టాండు వద్ద గల మునిసిపల్ ఉన్నత పాఠశాలలోని 155వ పోలింగ్ కేంద్రాన్ని ఆదర్శ పోలింగ్ స్టేషన్‌గా పరిగణించి కేంద్రం వద్ద బెలూన్లతో అలంకరించారు. అదే విధంగా మహిళా ఓటర్లు అధికంగా ఉన్న పిఠాపురం బాప్టిస్టు చర్చి మునిసిపల్ పాఠశాలలో 157వ పోలింగ్ కేంద్రాన్ని పింక్ పోలింగ్‌స్టేషన్‌గా, దివ్యాంగ ఓటర్లు అధికంగా ఉన్న కొత్తపల్లి మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల 182వ పోలింగ్ కేంద్రాన్ని ఆదర్శ దివ్యాంగ పోలింగ్ కేంద్రంగా తీర్చిదిద్దారు.



పిఠాపురంలో పింక్ పోలింగ్ కేంద్రం



పిఠాపురంలో ఆదర్శ పోలింగ్ స్టేషన్

సామర్లకోటలో

సామర్లకోట, మే 12: సామర్లకోట పట్టణ పరిధిలో యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన 134వ పోలింగ్ బూత్‌ను మోడల్ పోలింగ్ బూత్‌గా సామర్లకోట తహశీల్దార్ వై. శ్రీనివాస్ ఆదివారం సాయంత్రం ప్రారంభించారు.

కాకినాడ రూరల్‌లో

కాకినాడ రూరల్, మే 12: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కోసం రూరల్ మండలం గంగనాపల్లిలో పింక్ కలర్‌లో మహిళాపోలింగ్ కేంద్రంను ఇంద్రపాలెంలో మోడల్ పోలింగ్ స్టేషన్‌ను ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు.

గుర్తుంచుకోండి



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్. అందుకే సార్వత్రిక ఎన్నికలు వస్తే ఓ మూడు నెలలు ప్రజాస్వామ్య పండుగ వచ్చినట్లే. తమ పాలకులను ప్రజలు ఓటుతో ఎన్నుకునే క్రతువు. చెడు పాలనను ఓటు అనే వజ్రాయుధంతో అంతమొందించే అవకాశం. అయితే, ఎన్నికల్లో అత్యంత కీలకం 'గుర్తు'. దీనినే ఎన్నికల చిహ్నం అని కూడా అంటారు. దీనిని కేంద్ర ఎన్నికల సంఘం కేటాయిస్తుంది. ఈ సంఘం ఒక రాజ్యాంగబద్ధమైన సంస్థ. రాజ్యాంగంలోని 15వ భాగంలోని 324 నుంచి 329 అధికరణల వరకూ ఎన్నికల సంఘం బాధ్యతలు, విధులు, అధికారాలు గురించి వివరిస్తాయి. ఓటర్ల జాబితా తయారీ, ఎన్నికల నిర్వహణ, నియంత్రణ, పర్యవేక్షణ, రాజకీయ పార్టీ రిజిస్ట్రేషన్, చిహ్నం(ఎన్నికల గుర్తు) కేటాయింపు, ప్రాంతీయ, జాతీయ హోదాలు కల్పించడం, తొలగించడం వంటి అధికారాలు ఎన్నికల సంఘానికి ఉంటాయి. ఒకసారి ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ ప్రభుత్వ యంత్రాంగమంతా ఎన్నికల సంఘం అజమాయిషీలో పని చేయాల్సి ఉంటుంది. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951 సెక్షన్ 29ఏ ప్రకారం రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

గుర్తును కేటాయిస్తారు

ఫ్రీ సింబల్స్ అంటే అప్పటి వరకూ ఏ రాజకీయ పార్టీకి కేటాయించని 10 గుర్తులను ఎన్నికల సంఘానికి తెలియజేస్తే వాటి పరిశీలన అనంతరం ఒక గుర్తును సదరు పార్టీకి కేటాయిస్తారు. ఒక గుర్తును ఒకటి కంటే ఎక్కువ రాజకీయ పార్టీలు కోరుకుంటే లాటరీ ద్వారా గుర్తు కేటాయింపు జరుగుతుంది. ఈ విధంగా కేటాయించిన గుర్తు ఆ ఒక్క ఎన్నికలకు మాత్రమే ఉంటుంది. అప్పటికే గుర్తు పొంది కామన్ సింబల్‌ను కోల్పోయిన పార్టీలకు పాత గుర్తుతో ఒకసారి పోటీచేసే అవకాశం కల్పిస్తారు. రెండు జాతీయ పార్టీలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఒకే గుర్తు ఉండదు. ముఖ్యంగా నిరక్షరాస్యులు ఓటు వేసే సమయంలో అయోమయానికి గురి కాకుండా 'గుర్తు' సహాయ పడుతుంది. పార్టీ పేరు జ్ఞాపకం ఉన్నా లేకున్నా ఓటు వేయడానికి ఇబ్బంది ఉండదు. రాజకీయ పార్టీలు కూడా 'గుర్తు'పైనే ఆధారపడి ప్రచారం, కార్యకలాపాలు నిర్వహిస్తాయి.

పోలిన గుర్తులుంటాయి

● 'గుర్తు'ల విషయంలో ఒక్కోసారి అయోమయం కూడా ఉంటుంది. దీనికి వివిధ పార్టీలు, వ్యక్తులకు కేటాయించే గుర్తులు ఒకదానితో మరొకటి పోలి ఉండడం కూడా కారణంగా చెప్పవచ్చు. ఓట్లు చీల్చడానికి కీలక గుర్తులను పోలిన గుర్తులతో డమ్మీ అభ్యర్థులను పోటీకి దించే కుతంత్రాలు కూడా జరుగుతుంటాయి. ఉదాహరణకు రోడ్డు రోలర్, కారు.. గాజుగ్లాసు, స్టీలు గ్లాసు ఇలా గుర్తులు ఉండొచ్చు. బ్యాలెట్ పేపర్(ఈవీఎం)పై అవి ఒకే రకంగా కనిపించి అయోమయానికి గురి చేస్తాయి. ఉదాహరణకు తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులకు 4వేలు, మిగతా వారికి 2వేల లోపు ఓట్లు పడ్డాయి. అయితే పెద్దగా బలం లేని ఒక స్వతంత్ర అభ్యర్థికి ఏకంగా 27,973 వేల ఓట్లు వచ్చాయి. ఆయన పేరు కూడా పెద్దగా ప్రచారంలో లేదు. కానీ ఆయన గుర్తు రోడ్డు రోలర్ కావడం.. అది టీఆర్ఎస్ గుర్తు అయిన కారును పోలి ఉండడమే అంత పెద్ద సంఖ్యలో ఓట్లు రావడానికి కారణమని విశ్లేషించారు. ఓసారి నరసాపురం శాసనసభకు ఓ పార్టీ రెబల్ అభ్యర్థికి, ఓ పార్టీకి చెందిన లోక్‌సభ అభ్యర్థికి ఆటో గుర్తునే కేటాయించారు. దీంతో అసలు ఆ ప్రాంతంలో పరిచయమే లేని పార్టీ, ఆ అభ్యర్థికి పాలకొల్లులోనే 12వేల పైచిలుకు ఓట్లు పడ్డాయి. దీనికి ఆటో గుర్తే కారణమని రాజకీయ విశ్లేషకులు తేల్చారు. దేశవ్యాప్తంగా ఇలాంటి ఉదాహరణలు అనేకం ఉన్నాయి. అది ఒక రకం అయోమయమైతే.. కూటమిగా పోటీలో ఉన్న పార్టీల విషయంలో మరో రకం సందిగ్ధానికి అవకాశం ఉంటుంది.

జాగ్రత్తగా గమనించాలి

ప్రస్తుత ఎన్నికలను తీసుకుంటే.. టీడీపీ, బీజేపీ, జనసేన కలిసికట్టుగా(కూటమి)గా బరిలో దిగిన విషయం తెలిసిందే. టీడీపీ గుర్తు సైకిల్, బీజేపీ గుర్తు కమలం పువ్వు, జనసేన గుర్తు గాజుగ్లాసు అని తెలిసిందే. సాధారణంగా నిరక్షరాస్యులు, అవగాహనలేని ఓటర్లకు పార్టీ పేరు, గుర్తుపైనే స్పష్టత ఉంటుంది. అలాంటి వారు కూటమిగా పోటీలో ఉన్న పార్టీల విషయంలో మరీ తికమక పడుతుంటారు. ఉదాహరణకు రాష్ట్రంలో కూటమిగా పోటీలో ఉన్న టీడీపీ, బీజేపీ, జనసేన.. ఆయా పార్టీల నిర్ణయాల ప్రకారం అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లను పంచుకుంటాయి. అంటే ఒక చోట టీడీపీ పోటీలో ఉంటే అక్కడ మిగతా రెండు పార్టీల అభ్యర్థులను పోటీలో నిలపరు. ఉదాహరణకు అసెంబ్లీ(ఎమ్మెల్యే) స్థానాల విషయానికొస్తే రాజమహేంద్రవరం సిటీలో టీడీపీ అభ్యర్థి పోటీలో ఉన్నారు. అందువల్ల బీజేపీ, జనసేన పార్టీల అభ్యర్థులు ఉండరు. అలాగే కూటమి తరఫున రాజానగరంలో జనసేన అభ్యర్థి మాత్రమే ఉంటారు. టీడీపీ, బీజేపీ అభ్యర్థులు ఉండరు. కాబట్టి గుర్తులు కూడా ఆ మేరకే బ్యాలెట్‌పై ఉంటాయి. రాజమహేంద్రవరం సిటీ, రూరల్‌లో సైకిల్ గుర్తు కనిపిస్తే గ్లాసు, కమలం ఉండవు. అలాగే అనపర్తిలో కమలం గుర్తు ఉంటుంది. సైకిల్, గ్లాసు ఉండవు. సులభంగా 'గుర్తు'ంచుకోవాలంటే సైకిల్, గ్లాసు, కమలంలోని ఏ గుర్తుకు ఓటు వేసినా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి దక్కుతుంది.

ఓటు చైతన్యం

సింగపూర్ నుంచి వచ్చిన యువకుడు



పి.గన్నవరం, మే 12: ఓటు హక్కును వినియోగించుకునేందుకు విదేశం నుంచి స్వదేశానికి వచ్చాడు ఓ యువకుడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరానికి చెందిన బొరుసు సాయిరామ్ చదువు, ఉద్యోగం కోసం సింగపూర్ వెళ్లాడు. 18 ఏళ్లు నిండిన తర్వాత వచ్చిన ఓటును గత ఎన్నికలలో వినియోగించకపోవడంతో ఈ సారి ఎలాగైనా ఓటు వేయాలని స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. సింగపూర్ నుంచి రూ.50వేలు విమానం టిక్కెట్టు తీసుకుని ఆదివారం స్వగ్రామానికి వచ్చాడు. సోమవారం ఓటు హక్కును వినియోగించుకుని సోమవారం సాయంత్రం విమానం ద్వారా సింగపూర్ వెళ్తున్నట్లు సాయిరామ్ తెలిపారు. ఈ సందర్భంగా సాయిరామ్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో భారత దేశం ముందుండాలి, నేటి యువతరం భవిష్యత్ కోసం ఓటు హక్కు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలనే లక్ష్యంతో వచ్చానన్నారు. ఓటు హక్కు చాలా విలువైనదని ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని మంచి నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు.

పవన్‌పై అభిమానంతో నెదర్లాండ్ నుంచి..



సర్పవరం జంక్షన్, మే 12: సినీ నటుడు, జనసేనాధిపతి పవన్ కల్యాణ్‌పై ఉన్న అభిమానంతో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేసేందుకు ఖండాంతరాలు దాటుకుని ఆదివారం ఓ వివాహిత నెదర్లాండ్ నుంచి కాకినాడకు చేరుకుంది. కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామానికి చెందిన పబ్బినీడి లహరి, సతీష్‌లు భార్యాభర్తలు. వారికి ఇద్దరు సంతానం. ఉద్యోగ రీత్యా వారిద్దరు 14 ఏళ్ల కిందట నెదర్లాండ్‌లో స్థిరపడ్డారు. భర్త సతీష్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా, భార్య లహరి బిజినెస్ చేస్తున్నారు. లహరికి పవన్ అంటే అభిమానం. అసెంబ్లీ ఎన్నికల్లో పవన్ పిఠాపురం నుంచి పోటీ చేయడంతో ఈసారి ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఇక్కడకు రావాలని నిర్ణయించుకున్నారు. ఆదివారం సొంతూరు సర్పవరానికి ఇద్దరు పిల్లలతో చేరుకున్నారు.



బియ్యంతో తులాభారం నిర్వహిస్తున్న దృశ్యం

వెంకన్న ఆలయంలో పురందేశ్వరి పూజలు

ఆత్రేయపురం, మే 12: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం లోక్‌సభ కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి భర్త వెంకటేశ్వరరావుతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. తొలుత బీజేపీ శ్రేణులు ఆమెకు ఘన స్వాగతం పలికాయి. ప్రత్యేక పూజల అనంతరం వేద పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. బియ్యంతో తులాభారం నిర్వహించుకుని మొక్కు తీర్చుకున్నారు. క్షేత్రపాలకుడు విశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు.

సిమెంట్ స్తంభాన్ని ఢీకొని యువకుడి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

గండేపల్లి, మే 12: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... రాజానగరం మండలం చక్రద్వారబంధం గ్రామానికి చెందిన రాయుడు వీరభద్రరావు(17) ద్విచక్ర వాహనంపై జగ్గంపేట వైపు నుంచి రాజమండ్రి వైపు వెళుతుండగా బైక్ అదుపు తప్పి ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న సిమెంటు స్తంభాన్ని ఢీకొనడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనపై గండేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

దైవ దర్శనానికి వెళ్తూ ఊబిలో కూరుకుపోయి..

ఇద్దరు మహిళలతో సహా బాలిక మృతి





పాలూరి అనంతలక్ష్మి | కొప్పిరెడ్డి ఏసమ్మ | కర్రి సునీత

- వాడపల్లి వెంకన్న ఆలయానికి గోదావరి పాయలో కాలినడకన వెళ్తూ..
- మునిగి చనిపోయిన వైనం



మృతదేహాల తరలింపు

ఆత్రేయపురం/ఆలమూరు: మే 12: గౌతమి గోదావరి నదీలో కాలినడకన వాడపల్లి వస్తున్న ముగ్గురు మహిళలు ప్రమాదవశాత్తు ఊబిలో కూరుకుపోయి మృత్యువాతపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం బడుగువానిలంక, మడికి, చిలకపాడులకు చెందిన పాలూరి అనంతలక్ష్మి (40), కొప్పిరెడ్డి ఏసమ్మ (60), కర్రి సునీత (16) శనివారం ఉదయం కాలినడకన గోదావరి మార్గంలో వాడపల్లి బయల్దేరారు. మార్గమధ్యంలో వాడపల్లి శెట్టిబలిజపాలెం రేవులోని ఊబిలో కూరుకుపోయారు. అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో రక్షించేవారు లేరు. గుడికి వెళ్లిన వారు ఎంతకీ రాకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఫోన్లు చేస్తున్నా స్పందించకపోవడంతో శనివారం రాత్రి వాడపల్లి వెంకన్న ఆలయానికి వచ్చి ఆరా తీశారు. అక్కడ సిబ్బంది రాలేదు అని సమాధానం చెప్పడంతో ఆందోళనకు గురయ్యారు. గోదావరి మార్గంలో వెతికే ప్రయత్నం చేయగా ఆదివారం ఉదయం ఒక మృతదేహం లభ్యమైంది. మిగిలిన వారి కోసం గాలించగా అక్కడే లభ్యమయ్యాయి. మూడు మృతదేహాలను ఒడ్డుకు తీసుకువచ్చి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ప్రతి శనివారం వాడపల్లిలో వేలాది మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహిస్తారు. ఈ ముగ్గురు మహిళలూ ప్రతి శనివారం వాడపల్లి వెంకన్న ఆలయానికి వచ్చి అన్నదానంలో తమ వంతు సేవ చేస్తారు. సాయంత్రం ఆటోలో రావులపాలెం మీదుగా ఇళ్లకు వెళ్తారు. విధి వక్రీకరించడంతో మృత్యువాతపడ్డారు.

శోకసంద్రమైన చిలకలపాడు

చక్కగా నడుస్తున్న పచ్చని కాపురాల్లో ఒకసారిగా కుదుపు... ఇంటి దీపాలైన భార్యలు, అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న బాలిక మృతితో ఆయా కుటుంబాల్లో విషాదం అలముకుంది. ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లిన ముగ్గురు మహిళలు గోదావరిలో మునిగి మృతి చెందడంతో ఆలమూరు మండలం మడికి శివారు చిలకలపాడు శోకసంద్రమైంది. చిలకలపాడు గ్రామానికి చెందిన పాలూరి సత్యఅనంతలక్ష్మి, కొప్పిరెడ్డి ఏసమ్మ గత నాలుగు వారాలుగా ప్రతి శనివారం వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి కాలినడకన వెళ్తున్నారు. వీరు గోదావరి పాయ దాటి వాడపల్లి చేరుకుంటుంటారు. అదే విధంగా శనివారం ఉదయం 5.30 గంటలకు సత్యఅనంతలక్ష్మి, ఏసమ్మలతో పాటు ఇటీవలే పదో తరగతి పూర్తి చేసుకున్న కర్రి సునీత వెళ్లింది. బడుగువానిలంక ప్రాంతంలో గోదావరిలో ఇసుక మేటలు ఉన్నాయి. వాడపల్లి వైపు కొంతమేర పాయదాటి వెళ్లాల్సి ఉంది. వేసవి కావడంతో నీరు అంతంతమాత్రంగానే ఉంటుంది. దీంతో పాయదాటి వెళ్తారు. అయితే కాలువలకు నీరు నిలుపుదల చేయడంతో అదనంగా ఉన్న నీటిని ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల చేస్తారు. ఇది గమనించని వారు పాయలోకి దిగడంతో మునిగి మృత్యువాతపడ్డారు. వీరు వెళ్లిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాద ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వాడపల్లి వెళ్లిన ముగ్గురి వద్ద మొబైల్స్ ఉన్నాయి. ఉదయం పది గంటలకు ఫోను చేయగా స్విచ్ఛాఫ్ వచ్చాయి. ముగ్గురి ఫోన్లూ స్పందించపోవడంతో వారి బంధువుల్లో ఆందోళన పెరిగింది. వాడపల్లి వెళ్లి విచారించగా అక్కడికి చేరుకోలేనట్టు గుర్తించారు. దీంతో శనివారం రాత్రి గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం సత్యఅనంతలక్ష్మి మృతదేహం లభ్యమైంది. దీంతో మిగిలిన ఇద్దరూ కూడా మృతి చెంది ఉంటారని భావించి గాలింపు చర్యలు కొనసాగించగా ఏసమ్మ, సునీత మృతదేహాలు లభ్యమయ్యాయి. సత్యఅనంతలక్ష్మి, ఏసమ్మ మృతితో ఆ కుటుంబాల్లో విషాదం నెలకొంది.. బాలిక సునీత ఈ ఏడాది ఇంటర్లో చేరాల్సి ఉంది. సత్యఅనంతలక్ష్మికి భర్త, కుమార్తె, ఏసమ్మకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. సునీతకు తల్లిదండ్రులతో పాటు సోదరి ఉంది. ఆదివారం ఉదయం ప్రమాద వార్త తెలియగానే గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబసభ్యులు, బంధువులు బోరున విలపించారు. బాధిత కుటుంబాలను అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ యువ నేత బండారు సంజీవ్ పరామర్శించారు.

ట్రావెల్ బస్సు ఢీకొని రెండేళ్ల చిన్నారి మృతి

మరొకరికి తీవ్రగాయాలు





సిద్ధూ

నల్లజర్ల, మే 12: అన్న కొడుకు అంటే బాబాయ్‌కి ఎంతో మమకారం, కొడుకుకు సైతం బాబాయ్ అంటే చాలా ఇష్టం. రోజూ బైక్ ఎక్కించుకుని చక్కర్లు కొట్టడం అలవాటు. అలా సరదాగా ఆదివారం బైక్‌పై బయటకు వెళ్లిన వారిపై ట్రావెల్ బస్సు దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో రెండేళ్ల చిన్నారి మృతిచెందడం అందరినీ కంటతడి పెట్టించింది.వివరాలిలా ఉన్నాయి.. ద్వారకా తిరుమల మండలం గుణ్ణంపల్లి గ్రామానికి చెందిన గోన్నూరి రాజు, మరియమ్మ దంపతుల కుమారుడు సిద్ధూ (2)ను తీసుకుని రాజు దంపతులు దూబచర్లలోని బంధువుల ఇంట శుభ కార్యక్రమానికి వచ్చారు. వారితో పాటు రాజు సోదరుడు సూర్యచంద్రరావు కూడా వచ్చాడు. నల్లజర్ల బస్టాండ్‌లో తమ బంధువులను కలిసేందుకు సిద్ధూను బైక్ ఎక్కించుకుని దూబచర్ల నుంచి వస్తుండగా నల్లజర్లలో ప్రియాంక కన్వెన్షన్ హాల్ వద్ద సర్వీస్ రోడ్డులోకి వెళ్లే క్రమంలో వెనుక నుంచి ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో చిన్నారి సిద్ధూ అక్కడికక్కడే మృతి చెందగా సూర్యచంద్రరావుకు తీవ్ర గాయాలు కావడంతో ఏలూరు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా రాజు దంపతులకు సిద్ధూ ఏకైక సంతానం.

తరచూ ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతుందని

కూతురిపై కత్తితో తండ్రి దాడి

చికిత్స పొందుతూ యువతి మృతి



ఐ.పోలవరం, మే 12: కన్న కూతురిపైనే తండ్రి కత్తితో దాడి చేశాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం పాతఇంజరం గ్రామానికి చెందిన మాదాసు రాణి (27) అవివాహిత.. వేరొకరితో ఫోన్‌లో తరుచూ మాట్లాడుతుండటంతో ఆగ్రహించిన తండ్రి శివసుబ్రహ్మణ్యం ఆదివారం ఉదయం ఆమె మెడపై కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడ్డ ఆమెను స్థానికులు యానాం ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాణి మృతిచెందింది. సీఐ సలీం ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు శివసుబ్రహ్మణ్యం పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలిసింది.

మా ఇంటి ఓట్లు అమ్మబడవు

ప్రత్తిపాడులో ఓ ఇంటి ముందు బోర్డు



ప్రత్తిపాడు, మే 12: మా ఇంటి ఓట్లు అమ్మబడవంటూ కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో ఓ ఇంటి యజమాని ఆదివారం బోర్డు ఏర్పాటు చేశారు. తమ ఇంటి ఓట్లు అమ్ముకోమని ఆయన స్పష్టం చేయడంతో పాటుగా ఐపీసీ 171 డీ ఎఫ్ ప్రకారం ఓటు కొంటే ఒక సంవత్సరం జైలు శిక్ష ఉంటుందని స్పష్టం చేస్తూ ఆ బోర్డులో వివరించారు. స్వచ్ఛ ప్రజాస్వామ్య భారత్ నినాదంతో ఆర్ఎస్ఎస్ కార్యకర్త, ఇంటి యజమాని రాసంశెట్టి రాజా ఈ బోర్డు ఏర్పాటు చేశారు.

ఓటర్లకు భారీగా ప్రలోభాలు

- నగదు, మద్యం, బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ
- ఓటర్ల సొమ్ము నొక్కేసిన వైసీపీ నేతలు

పిఠాపురం, మే 12: ఓటర్లను ఆకట్టుకునేందుకు అధికార వైసీపీ నేతలు రకరకాల ప్రలోభాలకు తెరదీశారు. ఓటుకు రూ.3వేలు ఇచ్చారు. పలుచోట్ల ఓటర్లకు ఇచ్చిన డబ్బులను వైసీపీ నేతలు నొక్కేయడం వివాదాలకు దారితీసింది. ఓట్లకోసం ఇచ్చిన సొమ్ముల్లో 30నుంచి 50శాతం వరకూ చోటా.. మోటా నేతలు పక్కదారి పట్టించినట్లు చెబుతున్నారు. వీరితోపాటు కడప, చిత్తూరు జిల్లాలనుంచి పర్యవేక్షణకు వచ్చిన నాయకులు భారీగా సొమ్ములు వెనుకేసుకున్నట్లు సమాచారం. వీరు పలుచోట్ల పట్టణాల్లో వార్డు, గ్రామస్థాయి నాయకులకు పూర్తిగా డబ్బులు ఇవ్వకుండా స్వాహా చేసినట్లు ఆ పార్టీ నేతలే ఆరోపిస్తున్నారు. తమను ఎవరు పట్టించుకోవడం లేదని, ఓటర్లు వచ్చి తమను నిలదీస్తున్నారంటూ పిఠాపురం పట్టణానికి చెందిన వైసీపీ నేతలు ఆగ్రహంతో ప్రశ్నించేందుకు ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత కార్యాలయానికి వచ్చారు. అక్కడ ఎవరూ లేకపోవడంతో వీరు ఏంచేయాలో తెలియని పరిస్థితిలో పడ్డారు. పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లోను ఇదే పరిస్థితి నెలకొంది. మరోవైపు ఓటర్లకు మద్యం, బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పలుచోట్ల వైసీపీ నేతలు పంపిణీ చేసిన గోవా మద్యం తీసుకునేందుకు ఓటర్లు నిరాకరించారు. తమకు నాణ్యమైన మద్యాన్నే ఇవ్వాలని డిమాండ్ చేయడం గమనార్హం.

పవన్‌కల్యాణ్ పోటీ చేసే నియోజకవర్గంలో విచిత్ర పరిస్థితి

- ఐదేళ్లలో తాగునీటి సమస్య పరిష్కరించనందుకు నిరసనగా..

ఎన్నికలు బహిష్కరించనున్న ఉప్పరగూడెం ప్రజలు



ఉప్పరగూడెంలో తాగునీటిని ఆటోలో తెచ్చుకొంటున్న దృశ్యం

నాగులాపల్లి(కొత్తపల్లి), మే 12: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని ఓ గ్రామంలో విచిత్ర పరిస్థితి నెలకొంది. ఐదేళ్లలో తాగునీటి సమస్య పరిష్కరించనందుకు నిరసనగా ఆ ఊరి ఓటర్లు ఏకంగా ఎన్నికలు బహిష్కరించాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. తమ గ్రామానికి బిందెడు మంచినీళ్లు ఇప్పించండని, ఐదేళ్లుగా ఎన్నోసార్లు అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగామని, ఎమ్మెల్యే, ఎంపీలకు పలుసార్లు విన్నవించుకున్నామని, అయినా గ్రామానికి కనీసం గుక్కెడు మంచినీళ్లను నోచుకోలేకపోయామని కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం కొత్తపల్లి మండలంలోని నాగులాపల్లి గ్రామ పరిధి ఉప్పరగూడెం ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తమ సమయం వచ్చిందని, సోమవారం జరిగే ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో తమ గ్రామస్తులందరూ ఓటు వేయకుండా ఎన్నికలను బహిష్కరిస్తామని ఉప్పరగూడెం ప్రజలు ప్రతిజ్ఞ చేశారు. ఈ గ్రామంలో 850 మంది జనాభా కలిగి 650 ఓట్లు ఉన్నాయి. ఆయా ఓటర్లంతా కేవలం తాగునీరు సరఫరా చేయడంలో విఫలమయ్యారనే కారణంతో విసుగెత్తి తాము ఎన్నికలను బహిష్కరించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని ఉప్పరగూడెం ప్రజలు స్పష్టం చేశారు.

ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశం

కార్పొరేషన్(కాకినాడ), మే 12: కాకినాడ, కోనసీమ జిల్లాల్లోని ప్రభుత్వ ఐటీఐలు కాకినాడ, జగ్గంపేట, ప్రైవేట్ ఐటీఐల్లో ఆగస్టు 2024-25 సంవత్సరానికిగాను ప్రవేశం కోసం ప్రకటన విడుదల చేసినట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కాకినాడ, కోనసీమ జిల్లాల కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు iti.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో 2024, జూన్ 10వతేదీలోపు వివరాలు నమోదు చేసుకోవాలన్నా రు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థులంతా దగ్గరలోని ప్రభుత్వ ఐటీఐల్లో ఏర్పాటు చేసిన వెరిఫికేషన్ కేంద్రంలో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆన్‌లైన్ నమోదు పత్రాలతో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. అలా చేయని వారు కౌన్సెలింగ్‌కు అర్హులుకాదన్నారు. సందేహాలు ఉంటే 9494688516, 08842348182 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

18 సమస్యాత్మక గ్రామాలు

సామర్లకోట, మే 12: పెద్దాపురం నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 18 గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్టు పెద్దాపురం ఆర్వో జె.సీతారామారావు, పెద్దాపురం డీఎస్పీ కె.లతా కుమారి వెల్లడించారు. సామర్లకోట మండలం వేట్లపాలెం, జి.మేడపాడు, పెదబ్రహ్మదేవం, హుస్సేన్‌పురం, వెంకటకృష్ణరాయపురం, మాధవపట్నం, పి.వేమవరం గ్రామాలతో పాటు, పెద్దాపురం మండలంలో కాండ్రకోట, కట్టమూరు, గుడివాడ, ఉలిమేశ్వరం, మర్లావ, తిరుపతి, తాటిపర్తి, దివిలి.పులి మేరు, చినబ్రహ్మదేవం గ్రామాలు ఉన్నట్టు తెలిపారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో పాత నేరస్తులను బైండోవర్ చేశామన్నారు. పోలీసు బందోబస్తు పెంచామని చెప్పారు. ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని చెప్పారు. సామర్లకోటలోని పలు పోలింగ్ బూత్‌లను పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకులు,సీనియర్ ఐఏఎస్ అధికారి రాజేష్‌జోగ్‌పాల్ ఆదివారం పరిశీలించారు.

రాజమహేంద్రవరంలోనే పురందేశ్వరి ఓటు

రాజమహేంద్రవరం అర్బన్, మే 12 : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి రాజమహేంద్రవరం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా పోటీపడుతున్నారు. ఈ మేరకు సోమవారం రాజమహేంద్రవరం వీఎల్ పురంలోని ఎంసీఆర్ పాత హోమియో డిస్పెన్సరీ పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.ఈ మేరకు పార్టీ వర్గాలు ఒక ప్రకటనలో సమాచారం తెలియజేశారు. తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మాధవీలత కంబాలపేటలోని ఆనందరీజెన్సీ ఎదురుగా ఉన్న చున్నీ లాల్ జాజు రోటరీ మునిసిపల్ కార్పొరేషన్ స్కూల్‌లో ఓటు వేయనున్నారు.

దోచుకున్న డబ్బులు తియ్యండి!

- వైసీపీ నేతలను నిలదీసిన ఓటర్లు



కొండెవరంలో వైసీపీ నాయకుడి ఇంటి వద్ద రోడ్డుపై ఆందోళనకు దిగిన గ్రామస్తులు.. ఓటుకు డబ్బులు ఇవ్వలేదని జనం ఆందోళన

రాజమహేంద్రవరం, మే 12(ఆంధ్రజ్యోతి): 'ఐదేళ్లు దోచుకున్న డబ్బులు బయటకు తియ్యండి. మాకు ఎందుకు డబ్బులు ఇవ్వలేదు' ఇలా వైసీపీ అభ్య ర్థులను ఓటర్లు ముఖ్యంగా మహిళలు నిలదీశారు. నెల రోజుల ముందు నుంచే కార్యకర్తల ఇళ్లకు డబ్బు కట్టలను తరలించి వైసీపీ అభ్యర్థులు పోలింగ్‌కి నాలుగు రోజుల ముందు నుంచీ పంచడం మొదలు పెట్టారు. బూత్‌లవారీగా తమ మనుషులను నియ మించి ఓటరు లిస్టు ప్రకారం ముట్టజెప్పారు. ఈ క్రమంలో కొన్ని ప్రాంతాల్లోని కొన్ని సామాజిక వర్గా లకు ఇవ్వవద్దని ఆదేశించారు. రాజమహేంద్రవరం రూరల్‌లోని కాపులకు, సిటీలోని శెట్టిబలిజ, కాపు, ముస్లింకు, క్వారీ మార్కెట్ ఏరియాలోని బీసీలకు రూరల్‌లోని బొగ్గులదిబ్బలో ఎస్సీలకు ఇలా ఆయా ప్రాంతాల్లో కొన్ని సామాజిక వర్గాలను తప్పించారు. దీనికితోడు కిందిస్థాయి నాయకులు నొక్కుడు షురూ చేశారు. వైసీపీ అభ్యర్థులు కొన్నిరోజుల నుంచి స్థానిక కార్యకర్తలతో సర్వే చేయించుకొని డబ్బుల పంపిణీ వచ్చేసరికి వారిని పక్కన పెట్టేశారు. ఉదాహరణకు రాజమహేంద్రవరం రూరల్ వైసీపీ అభ్యర్థి వేణు తన మునుపటి నియోజకవర్గం రామచంద్రాపురం నుంచి కొందరిని తీసుకొచ్చి నగదు పంపిణీ కార్యక్ర మం అప్పగించారు. అలాగే సిటీ వైసీపీ అభ్యర్థి భరత్ కూడా చేశారు. జిల్లాలోని అధికశాతం వైసీపీ అభ్యర్థులు ఇదే తీరు సాగించారు. ఇదంతా కలిసి ఓటర్లను చిర్రెత్తించింది. కొందరికి డబ్బులు ఇచ్చి మరికొందరి డబ్బులు మింగేయడంతో గొడవలు మొదలయ్యాయి. శని, ఆదివారాలకు ఇవి తీవ్ర రూపం దాల్చాయి. శనివారంరాత్రి భరత్ కార్యాలయాన్ని సుమారు 400మంది మహిళలు చుట్టుము ట్టారు. అలాగే వేణు ఇంటికి రూరల్ మహిళలు వెళ్లి నిలదీశారు. దీంతో పోలీసులను రప్పించుకొని మహిళలను బెదిరించి పంపేశారు. ఆదివారం కొందరికి నగదులో సగం కోసేసి చేతిలో పెట్టి మమ అనిపించారు. ఎన్నికల్లో ఓటుకు నోటు తీసుకోవడం తప్పే అయినప్పటికీ దానిని ఓటర్ల హక్కుగా నాయకులు మార్చేశారనేది నిర్వివాదాంశం. పైగా వైసీపీ పెద్ద మొత్తంలో ఓటుకు రేటు కట్టడంతో ఇంటి ఖర్చులకు అయినా వస్తాయని సామాన్యులు ఆశపడడంలో తప్పేముందనే వాదనా లేకపోలేదు.

కొండెవరంలో వైసీపీ నాయకుడి ఇంటి రహదారి దిగ్బంధం

కొండెవరం(కొత్తపల్లి), మే 12: తమ గ్రామాల్లో వైసీపీ నాయకులు ఎవరికీ డబ్బులు ఇవ్వలేదని కొత్తపల్లి మండలం కొండెవరం శివారు శొంఠివారిపాకలు, ఇందిరానగర్ గ్రామస్తులు ఆదివారం కొండెవరం మెయిన్‌రోడ్‌పై ఆందోళన చేపట్టారు. వైసీపీ నాయకులు గ్రామంలో కొందరికి ఒక్కొక్కరికీ రూ.3వేల చొప్పున డబ్బులు ఇచ్చి 100 కుటుంబాలకు చెందిన ఓటర్లకు డబ్బులు ఇవ్వకుండా నొక్కేశారని గ్రామస్తులు ఆ నాయకుల ఇళ్లవద్ద ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. రోడ్డుపై ఆందోళన చేపట్టడంతో స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంనుంచి యాక్సిస్ బ్యాంక్ వరకు రోడ్డులో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నాయకులు ఇళ్లనుంచి బయటకు రాకపోవడంతో పిఠాపురంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కార్యాలయానికి తరలివెళ్లారు.

నకిలీ మద్యం తయారీ ముఠా గుట్టురట్టు

- 20 లీటర్ల నకిలీ మద్యం, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

రంగంపేట, మే 12: రంగంపేట ఎస్ఈబీ పోలీసులు మండలంలో నకిలీ మద్యం తయారు చేస్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఈబీ సీఐ ఎస్.రాంబాబు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లకు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా స్పెషల్ బ్యూరో అధికారి, అడిషనల్ ఎస్పీ పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు రంగంపేట ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో నకిలీ మద్యం తయారు చేస్తున్నవారిపై దాడులు నిర్వహించగా నల్లమిల్లి, సింగంపల్లి, పెద్దాపురం మండలం ఆనూరు గ్రామాల్లో దాడులు నిర్వహించగా నకిలీ మద్యం తయారు చేస్తున్న మామిడాల సూరిబాబు, మేడిశెట్టి సతీష్, బల్ల వీరప్రభలు, యాగా రాంబాబు, నాగులపల్లి బాబూరావు అను ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి 20 లీటర్ల (ఎక్స్ట్రాన్యూట్రల్ ఆల్క హాల్) నకిలీ మద్యం, ఐదు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. వీటి విలువ సుమారు 225000 రూపాయలు ఉంటుందన్నారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు జరుగుతుందన్నారు. ఈ దాడులలో సీఐ ఎస్.రాంబాబు, ఎస్ఐలు జె.విజయ్‌కుమార్, జి.అనిల్‌బాబు, సిబ్బంది ఎం.బాబురావు, బి.అబ్బాయినాయుడు, ఎస్‌కే బషీర్ పాల్గొన్నారని తెలిపారు.



నకిలీ మద్యం తయారీ ముఠాను పట్టుకున్న పోలీసులు

ఎన్నికల సరళిని పరిశీలించేందుకు

పటిష్టమైన నిఘా : కలెక్టర్ నివాస్

కలెక్టరేట్(కాకినాడ), మే 12: ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించేందుకు కోసం పటిష్టమైన నిఘా విభాగాన్ని ఏర్పాటు చేశామని కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను జిల్లా ఎన్నికల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సాధారణ ఎన్నికల ప్రక్రియను జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌నుంచి పర్యవేక్షిస్తామన్నారు. సాధారణ ఎన్నికల పోలింగ్ సోమవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరగనుండడంతో మాక్‌పోల్ ప్రతి రెండు గంటలకు పోలింగ్‌శాతం ఇతర రిపోర్టులను ప్రత్యేక దృష్టిపెట్టి సిద్ధం చేయాలన్నారు. ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులను సమన్వయం చేసుకుని సకాలంలో సమాచారాన్ని సేకరించాలన్నారు. నిరంతరం వెబ్‌కాస్టింగ్ విధానం ద్వారా ఆయా పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న పోలింగ్ సరళిని పరిశీలించాలన్నారు. ఏదైనా పోలింగ్ కేంద్రంలో సమస్య తలెత్తితే గుర్తించి కంట్రోల్‌రూమ్ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి తిప్పేనాయక్, డీపీవో భారతి సౌజన్య, సీపీవో త్రినాథ్, వీసీ కృష్ణమూర్తి, డీఆర్డీఏ పీడీ శ్రీరమణి పాల్గొన్నారు.

వైభవంగా వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

- చంద్రప్రభ వాహనంపై దర్శనమిచ్చిన స్వామి

ఐ.పోలవరం, మే 12: మురమళ్ళ శ్రీభద్రకాళీవిశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు రెండో రోజు ఆదివారం వైభవంగా జరిగాయి. యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో వాస్తుపూజ, లక్ష్మీగణపతి హోమం, రుద్ర హోమం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం చంద్రప్రభ వాహనంపై వీరేశ్వరస్వామి భద్రకాళీ సమేతంగా ఆసీనులై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. రాత్రి స్వామివారి దివ్యకళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణతో పాటు సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఏజెన్సీ సమాచారం

నేడు మన్యంలో ఓట్ల పండగ

- ఓటును సెంటిమెంటుగా భావించే గిరిజనులు
- మైళ్ల కొద్దీ దూరాన్ని కాలినడకన పోలింగ్ కేంద్రాలకు వచ్చే గిరిజనులు

రంపచోడవరం, మే12: నేడు మన్యంలో ఓట్ల పండగ. 6వేల చ.కి.మీ విస్తీర్ణంలో మ 11 మండలాలలో సుమారు 832 గ్రామాల్లో మన్యం విస్తరించి ఒకే నియోజకవర్గంగా ఉంది. ఈ నియోజకవర్గం మొత్తం మీద 2,77,317 మంది ఓటర్లు ఉండగా అందులో అత్యధికంగా 1,45,400 మంది మహిళా ఓటర్లే ఉన్నారు. భౌగోళికంగా గ్రామాల మధ్య దూరం ఎక్కువగా ఉండటం, కొన్ని గ్రామాలు మౌళిక సౌకర్యాలకు దూరంగా ఉండటంతో ఆయా గ్రామాల నుంచి బయటకు రావాలంటే ఇబ్బందికరమైన పరిస్థితులే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో కూడా ఓటు హక్కును పవిత్రంగా భావించే గిరిజనులు మైదాన ప్రాంతీయుల కంటే మెరుగ్గా ఆలోచించి ఓటు వేస్తేనే జీవించి ఉన్నట్టు అన్న చందంగానే వ్యవహరిస్తూ ఎంత దూరమైనా తన ఓటు హక్కు కోసం తరలి వస్తుంటారు. ఎన్నో గంటల పాటు పయనించడం, ఓటు హక్కు కోసం ముందు రోజే బయల్దేరి రావడం, బంధువల ఇంటి వద్ద బస చేయడం వారికి రివాజు. వీరి పరిస్థితులు, వారు పడే వ్యయ ప్రయాశలు తెలిసిన అధికారులు ఓటు హక్కు కోసం వారికి అనువుగా పోలింగ్ కేంద్రాలను సైతం ఏర్పాటు చేయడంలో విఫలమవుతున్నారు. 832 గ్రామాలకు కేవలం 399 పోలింగ్ కేంద్రాలను మాత్రమే ఏర్పాటు చేశారు. ఎంత దూరమైనా గిరిజనులు వచ్చి ఓటు హక్కును వినియోగించుకుంటారన్న ధీమాతోనే అధికార యంత్రాంగం ఎక్కువ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదన్న విమర్శలూ వ్యక్తమవుతున్నాయి.

మన్యంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది, సామగ్రి


ఈవీఎంలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఐటీడీఏ పీవో, రిటర్నింగ్ అధికారి

రంపచోడవరం, మే 12: సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆదివారం రిటర్నింగ్ అధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ చేశారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈవీఎంలు, వీవీప్యాడ్‌లు, ఇతర ఎన్నికల సామాగ్రి సిబ్బందికి 23 కౌంటర్లతో అందజేసి 86 బస్సులు, 79 జీపుల ద్వారా పోలింగ్ కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. సుమారు మూడు వేల మంది ఉద్యోగులను ఎన్నికల విధులకు నియమించినట్లు తెలిపారు. ఐటీడీఏ పీవోలు సూరజ్ గనోరే, కావూరి చైతన్య, ఏఎస్పీ జగదీష్ అడహళ్లి సామాగ్రి పంపిణీ కౌంటర్లను పర్యవేక్షించారు. రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ నియోజకవర్గంలో 2లక్షల 77వేల 317 ఓటర్లకు 399 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలకు మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. పాతకోట, బొడ్డగండి, గుర్తేడు పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలు, వీవీ ప్యాడు ఎన్నికల అనంతరం స్ట్రాంగ్ రూమ్‌కు తరలించేందుకు హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పీడీఎంఎస్ యాప్‌లో ఎన్నికలకు సంబందించిన వివరాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్ట్ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్ర మంలో తహశీల్దార్లు ఎ.కృష్ణజ్యోతి, చలపతిరావు, నజీముల్లా, నాగమణి, నాగ రాజు, డీవీ సత్యనారాయణ, డీఎల్‌పీవో రఘునందన్, ఎంపీడీవోలు హరికృష్ణ, వీర కిషోర్, డీటీలు శివ, స్వామి, బి.రాజు, బాలాజీ, చైతన్య, ఎ.సత్యనారాయణ, శ్రీధర్, రవీంద్రబాబు, సరిత, వీరభద్రరావు పాల్గొన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- సరిహద్దులు మూసివేత
- సురక్షిత ప్రాంతాలలో పోలింగ్ సిబ్బంది

చింతూరు, మే 12 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చింతూరు డివిజన్‌లో ఎన్నికల ప్రక్రియకు రంగం సిద్ధమైంది. చింతూరు డివిజన్‌లో 1,04,037 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 54,500 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. చింతూరు డివిజను ఛత్తీస్‌గడ్, ఒడిస్సా, తెలంగాణ సరిహద్దులు ఆనుకొని ఉండడంతో మావోయిస్టుల నుంచి ఎటువంటి సమస్య తలెత్తకుండా ఉండేందుకని పోలీసు బలగాలను పెద్దఎత్తున మోహరింప చేశారు. అదేదశలో ఏడుగురాళ్ళపల్లి పేగ, అల్లిగూడెం, చిడుమూరు తదితర పోలింగ్ కేంద్రాలకు చెందిన ఎన్నికల సిబ్బందికి ఆదివారం రాత్రి సురక్షిత ప్రాంతాలలో బసను ఏర్పాటు చేశారు. అదే దశలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలకు చెందిన పలు గ్రామాల ఓటర్లకు సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి ఆయా ప్రాంతాలలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు గాను పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య పర్యవేక్షిస్తున్నారు.

రాజవొమ్మంగి: అసెంబ్లీ మరియు పార్లమెంట్ ఎన్నికలకు రాజవొమ్మంగి మండలంలోని 52పోలింగ్ బూత్‌లకు ఎన్నికల సామగ్రితో సిబ్బంది ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. రంపచోడవరం నుంచి 10 బస్సులలో ఎన్నికల సామగ్రి, సిబ్బందిని రాజవొమ్మంగి మండలంలోని పోలింగ్ కేంద్రాలకు సెక్టర్ అధికారులు చేరవేశారు. అలానే రాజవొమ్మంగి, బరదనాంపల్లి, లాగరాయి పోలింగ్ కేంద్రంలో కేంద్ర బాలగాలు మోహరించాయి.

మన్యంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఈవీఎంలు

మోతుగూడెం, మే12: చింతూరు మండలం మోతుగూడెం ఫోర్‌బై, సుకుమామిడి, తూలుకొండ, గూడూరు, కొత్తపల్లి, చదలవాడ, తులసిపాక పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం మిషన్‌లు చేరుకున్నాయి.

కేంద్ర బలగాలతో గాలింపు ముమ్మరం


కల్వర్టుల వద్ద తనిఖీ చేస్తున్న కేంద్ర బలగాలు

మోతుగూడెం, మే12: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్పీ శ్రీ తూహిన్‌సిన్హా, రంపచోడవరం ఓఎస్డీ కేవీ మహేశ్వర రెడ్డి, చింతూరు అడిషనల్ ఎస్పీ రాహుల్ మీనా, చింతూరు సీఐ గజేంద్రకుమార్ ఆదేశాల మేరకు జరగబోయే సార్వత్రిక ఎన్నికల సందర్భంగా డొంకరాయిపోలీస్‌స్టేషన్ పరిధిలో కేంద్రబలగాలతో మావోయిస్టుల ప్రభావితప్రాంతాల్లో కల్వర్టులు, తదితర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. అదే విధంగా క్విక్ రియాక్షన్ టీమ్‌తో వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేసినట్లు డొంకరాయి ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

దేవీపట్నం, మే12: నేడు జరగబోయే ఎన్నికలకు మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. నియోజకవర్గ కేంద్రం నుంచి పోలింగ్ సామాన్లతో సిబ్బంది ఆదివారం సాయంత్రానికి పోలింగ్ బూత్‌లకు చేరుకున్నారు. సోమవారం జరిగే ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. 29 పోలింగ్ బూత్‌లలో సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు.

వరరామచంద్రాపురం, మే 12: నేడు జరగబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తహశీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ తెలిపారు. మండలంలో 29 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసామన్నారు. మండలంలోని రహదారి సౌకర్యంలేని తుమ్మిలేరు గ్రామ పంచా యితి, తుమ్మిలేరు గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి వెళ్ళే ఎన్నికల అధికారులను బోట్ ద్వారా పంపించామని తహశీల్దార్ తెలిపారు. 29 పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పి ంచామన్నారు. మండలంలో 19776 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారని ఆయన తెలిపారు. ప్రతి పోలింగ్ స్టేషన్ దగ్గర పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసామన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

కూనవరం, మే12: సార్వత్రిక ఎన్నికలకు కూనవరం మండలంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ మురళీకృష్ణ తెలిపారు. మొత్తం 25పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. వీటిలో వెంకన్నగూడెంలో మోడరన్ పోలింగ్ బూత్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 20362మంది ఓటర్లు ఉన్నారని వీరిలో పురుషులు 9428, స్త్రీలు 10921మంది, ట్రాన్స్‌జెండర్స్ ముగ్గురు ఉన్నట్లు తెలిపారు. రెండు ప్రధాన సమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్లు గుర్తించామని కాచవరం, కూటూరు రెండు బూత్‌లను అత్యంత సమస్యాత్మంగా గుర్తించామన్నారు. ఈపోలింగ్‌స్టేషన్ల వద్ద అత్యధిక పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి ఓటు వినియోగించుకోవాలన్నారు.

తిమ్మరాజుపాలెంలో మజ్జిగ చలివేంద్రం

నిడదవోలు, మే 12: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ ఆలయం వద్ద ఆదివారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. అనంతరం ఆలయ హుండీ లెక్కించారు. ఆదాయం రూ.1,04,787 వచ్చింది. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు గాజుల రంగారావు, ఆయినీడి వెంకటకృష్ణ, ఎస్‌వీకె శర్మ, ఆలయ ఈవో హరిసూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



అనపర్తిలోని ఎన్నికల సిబ్బందితో ముచ్చటిస్తున్న జిల్లా కలెక్టర్ మాధవీలత


నన్నయ విశ్వవిద్యాలయంలో ఎన్నికల సామగ్రిని సరిచూసుకుంటున్న ఎన్నికల సిబ్బంది


ఎన్నికల సిబ్బందితో కిక్కిరిసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్

పోలింగ్‌కు రెడీ

- నేడే పోలింగ్ ● మెటీరియల్ పంపిణీని పరిశీలించిన కలెక్టర్ మాధవీలత


ఎన్నికల సామగ్రితో బస్సుల వద్దకు చేరుతున్న పోలింగ్ సిబ్బంది

అనపర్తి, మే 12 : సోమవారం జరుగనున్న సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేస్తున్నామని ఎన్నికల నిర్వహణకు సిబ్బందిని పూర్తిస్థాయిలో సమాయత్తం చేశామని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. ఆదివారం అనపర్తి బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ మెటీరియల్ పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ సిబ్బందితో ఆమె కొద్దిసేపు ముచ్చటించారు. పంపిణీ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును పరిశీలించిన ఆమె వైద్య సిబ్బందికిపలు సూచనలు చేశారు. నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై ఆమె స్థానిక ఆర్వో మాధురితో చర్చించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనపర్తి నియోజకవర్గంలోని 228 పోలింగ్ కేంద్రాలలో సుమారు 2వేల మంది సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లు, సర్వైవల్ బృందాలు, పోలీసు సిబ్బంది విధుల్లో భాగస్వాములు అవుతున్నారని అన్నారు. నియోజకవర్గంలోని 228 పోలింగ్ కేంద్రాలను 101 లోకేషన్లలో ఏర్పాటు చేశామన్నారు. 21 మంది సెక్టార్ అధికారులు, 21మంది రూట్ ఆఫీసర్లను నియమించామని 228 పోలింగ్ కేంద్రాలలోను వెబ్‌కాస్టింట్ ఏర్పాటు చేశామన్నారు. 186 మంది పీవోలు, 189 మంది ఏపీవోలు, 707మంది ఇతర సిబ్బందిని నియమించామన్నారు. ఎన్నికల ప్రక్రియను 63మంది మైక్రో అబ్జర్వర్లు నిశితంగా పరిశీలించనున్నామని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట ఆర్వో ఎం.మాదురి, నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎన్నికల అధికారులు ఉన్నారు.

అనపర్తిలో గంటపాటు కురిసిన వర్షం

అనపర్తిలో ఆదివారం మధ్యాహ్నం గంటపాటు మోస్తరు వర్షం కురిసింది. దీంతో పోలింగ్ మెటీరి యల్ పంపిణీలో కొద్దిపాటి ఆటంకం కలిగింది. వ ర్షం ప్రారంభం కావడంతో అప్పటివరకు బయట టెంట్‌లలో కూర్చున్న సిబ్బంది పాఠశాలలోని వర ండాలోకి పరుగులు తీశారు. అప్పటివరకు ఎండ వేడిమితే అల్లాడిన ఎన్నికల సిబ్బంది వర్షం కురవ డంతో సేదతీరారు.

అనపర్తిలో ఎన్నికల విధుల్లో 473 మంది పోలీసులు

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అనపర్తి నియోజకవర్గంలో 228 పోలింగ్ స్టేషన్లవద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అనపర్తి సీఐ పి.శివ గణేష్ తెలిపారు. ఎన్నికల సందర్భంగా అనపర్తి నియోజక వర్గంలో 473మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. బందోబస్తులో అడిషనల్ ఎస్పీతోపాటు ఒక డీఎస్పీ, సీఐలు నలుగురు, ఎస్ఐలు ఆరుగురు, ఏఎస్ఐ హెచ్‌సీలు 37 మంది, కానిస్టేబుల్స్ 103, హోంగార్డు 18 మంది, ఆర్‌ఎస్‌ఐ పోలీసులు 75 మంది, అదర్స్ 127మంది విధులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- రాజానగరం రిటర్నింగ్ అధికారి చైత్రవర్షిణి

దివాన్‌చెరువు, మే 12: రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో సోమవారం పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు అన్ని పూర్తిచేశామని రాజమహేంద్రవరం ఆర్డీవో, రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఏ.చైత్రవర్షిణి తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కేంద్రంలో ఆదివారం ఎన్నికల సామాగ్రిని, ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్‌లను ఎన్నికల సిబ్బందికి అందజేశారు. ఈసందర్భంగా విలేకరులతో ఆమె మాట్లాడుతూ ఓటర్లు జాబితాలను పూర్తి చేశామని, ఓటర్లు అందరూ తప్పక ఓటువేయాలని కోరారు. ఎన్నికల నిర్వహణకు పీవో, ఏపీవోలతో సహా 1300మంది సిబ్బందిని నియ మించామ న్నారు. 50మంది మైక్రో అబ్బర్వర్లును ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాలకు సామాగ్రిని చేరవేసేందుకు 56 బస్సులు ఏర్పాటు చేశామని చెప్పారు. ఒక్కొక్క పోలింగ్ కేంద్రానికి రెండు ఈవీఎంలు అందజేశామని వీటిలో అసెంబ్లీ ఎన్నికకు ఒకటి, లోక్‌సభ ఎన్నికల కోసం మరొక దానిని వినియో గిస్తారన్నారు. పోలింగ్ కేంద్రానికి నియమించిన సిబ్బంది అందరికీ టూత్‌బ్రష్, పేస్ట్, సబ్బులు, దోమలచక్రం, వంటి సామా గ్రితో సమకూర్చిన కిట్‌ను అందజేశామన్నారు. అంతకు ముందు పోలింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకూ పోలింగ్ జరుగుతుందన్నారు. సోమవారం సాయంత్రం పోలింగ్ ముగిసిన అనంతరం రాజానగరం నియోజకవర్గానికి సంబంధించిన బ్యాలెట్ యూనిట్‌లను నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణం లో ఏర్పాటుచేసే రిసెప్షన్ కేంద్రంలో స్వీకరించి స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రప రిచామన్నారు.

ఓటింగ్ విధానం ఇలా..

కడియం, మే 12: నేడు ఓటు హక్కు వినియోగించుకోనున్న అభ్యర్థులు గమనించాల్సిన విషయాలు... ఓటరు స్లిప్‌తో మీకు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి వెళ్లాలి. పోలింగ్ బూత్‌లోకి వెళ్లిన వెంటనే ఓటరుస్లిప్/ఓటరు కార్డు చూపించాలి. పోలింగ్ అధికారి మీ స్లిప్‌ను పరిశీలిస్తారు. తరువాత మరో అధికారి మీ చూపుడు వేలుకు సిరా రాసి మీ. సంతకం/వేలిముద్ర తీసుకుంటారు. మరో అధికారి మీ స్లిప్ చూసి మీకు ఓటు విడుదల చేస్తారు. మీరు ఓటింగ్ కంపార్టుమెంట్‌లోకి వెళ్లాలి. అక్కడ ఉన్న ఈవీఎం మిషన్‌లో పార్టీలు, వాటి గుర్తులు కనిపిస్తాయి. వాటికి ఎదురుగా నీలం రంగు బటన్‌లు కూడా కనిపిస్తాయి. మీరు ఓటు వేయాలనుకున్న పార్టీగుర్తుకు ఎదురుగా నీలం రంగు బటన్ ఉంటుంది. నీలం రంగు బటన్ నొక్కగానే ఎరుపు రంగు బలుబు వెలగడంతోపాటు బీప్ శబ్దం వస్తోంది. వీవీ పేడ్ మిషన్‌లో ఓటు వేసిన అభ్యర్థి పేరు, గుర్తు 7 సెకన్లు పాటు కనిపిస్తోంది. ఆ స్లిప్ దానంతట అదే సీల్డ్‌బాక్సులోకి వెళ్లిపోతుంది. అంతటితో ఓటింగ్ ప్రక్రియ అవుతుంది. ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే పోలింగ్ అధికారికి తెలియజేయాలి.


డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించిన ఎన్నికల సాధారణ పరిశీలకుడు

సిబ్బందితో బస్సులు నన్నయ ప్రాంగణం నుంచి బయలు దేరిన కొద్దిసేపటికే వాతావరణం మారి చినుకులు పడ్డాయి. సోమవారం జరిగే పోలింగ్‌లో నియోజకవర్గంలో 2లక్షల16వేల491 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో ఒక లక్షా6వేల 879 మంది పురుషులు కాగా, ఒకలక్షా తొమ్మిది వేల 606 మంది మహిళా ఓటర్లు, మరో 6గురు థర్డ్‌జండర్ ఓటర్లు ఉన్నారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించిన ఎన్నికల పరిశీలకుడు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామా గ్రి పంపిణీ కేంద్రాన్ని సాధారణ ఎన్నికల పరిశీలకుడు కే. బాల సుబ్రహ్మ ణ్యం ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో, రాజానగరం ఆర్వో ఏ.చైత్రవర్షిణి ఎన్నికల సామాగ్రి పంపిణీకి సంబంధించి పలు విషయాలు ఆయనకు వివరించారు. కొంతమంది ఎన్నికల సిబ్బందితో పరిశీలకుడు సుబ్రహ్మణ్యం మాట్లాడారు.

కడియం మండలంలో 78 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

కడియం, మే 12: పోలింగ్‌కు సర్వం సిద్ధమైనట్లు ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్, తహసీల్దార్ బి.రమాదేవి, సీఐ బి.తులసీధర్‌లు తెలిపారు. కడియం మండలంలో 11 గ్రామాల పరిధిలో 78 పోలింగ్ కేంద్రాల్లో 36,983 మంది పురుషులు, 37,799 మంది స్త్రీలు, 4 గురు ట్రాన్స్‌జెండర్లు మొత్తం 74,786 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రం లోపల, బయట రెండేసి చొప్పున సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు పోలింగ్ కేంద్రానికి 100 మీటర్లు దూరం వరకు ఎటువంటి వాహనాల అనుమతి లేదన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో పోలింగ్ అధికారి(పీవో), అసిస్టెంట్ పోలింగ్ అధికారి (ఏపీవో), అదనపు పోలింగ్ ఆఫీసర్లు (ఓపీవో) ఉంటారన్నారు. 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ఎటువంటి అల్లర్లు, ఘర్షణలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎస్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఆర్మ్‌డ్ ఫోర్స్ ఏపీఎస్పీ, సివిల్, సీఆర్‌పీఎఫ్ తదితర పోలీసులు సుమారు 300 మంది వరకు పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాటు చేశామన్నారు.

పోలింగ్ కేంద్రాలకు సామగ్రి తరలింపు

- రాజమహేంద్రవరంలో 234 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు


పోలింగ్ మెటీరియల్ పంపిణీని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారిణి మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ, మే 12 : రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల పోలింగ్ సామాగ్రి తరలింపు ప్రక్రియ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారిణి డాక్టర్ కె.మాధవీలత, సిటీ ఆర్‌వో దినేష్‌కుమార్‌లు ఈ ప్రక్రియను పరిశీలించారు. నగరంలో 90 లోకేషన్లలో ఉన్న 237 పోలింగ్ కేంద్రాల్లో 2,67,484 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఈ పోలింగ్ కోసం 1530 మంది పోలీసులు, 88 మంది మైక్రో అబ్జర్వర్లు, 3 సర్వైవల్ బృందాలు విధుల్లో భాగస్వాములు అయ్యారు. 20మంది సెక్టార్ అధికారులు, 20 మంది రూట్‌ల ద్వారా పోలింగ్ సామాగ్రిని తరలింపు కోసం నియమించారు. ఈ సందర్భంగా ఆర్‌వో దినేష్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతవంతమైన వాతావారణంలో జరుగుతాయన్నారు. 237 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో పీవోలు 259 మంది. ఏపీవోలు 259 మంది, ఇతర పోలింగ్ సిబ్బంది 1012 మందిని నియమించినట్లు తెలిపారు. ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్స్, బ్యాలెట్ యూనిట్స్ తరలింపు పకడ్బందీగా నిర్వహించినట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది

రాజానగరం నియోజకవర్గంలోని 216 పోలింగ్ కేంద్రాలకు సంబ ంధించిన ఈవీఎంలు, కంపార్ట్‌మెంట్ ప్యాడ్‌లు తదితర ఎన్నికల సామాగ్రి తో ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌వద్ద బస్సులకోసం సిబ్బంది వేచి ఉన్న సమయంలో ఎండ తీవ్రంగా ఉండడంతో దానిని తాళలేక కొంతమంది సిబ్బంది నీడకోసం కంపార్ట్‌మెంట్ ప్యాడ్‌లను తలపై పెట్టుకోవడం కానవ చ్చింది. ఎన్నికల


ఈవిఎంల పనితీరు గురించి వివరిస్తున్న దృశ్యం


అనపర్తిలో వర్షం కురవడంతో తడిసిపోయిన టెంట్‌లు, కుర్చీలు


ఎన్నికల విధులకు వెళుతున్న సిబ్బంది

బరిలో నిలిచింది వీరే..

- 7 నియోజకవర్గాల్లో 71 మంది ..
- పార్లమెంట్ బరిలో 12 మంది అభ్యర్థులు..

రాజమహేంద్రవరం సిటీ, మే 12: తూర్పుగోదావరి జిల్లాలో సోమవారం సార్వత్రిక ఎన్నికలు-2024 పోలింగ్ జరుగనున్నది. అందుకోసం అన్ని ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, అసెంబ్లీ ఆర్‌వోలు పూర్తి చేశారు. 7 నియోజకవర్గాల్లో పోటీలో 71 మంది ఎమ్మెల్యే అభ్యర్థులు, 12 మంది ఎంపీ అభ్యర్థులు పోటీపడుతున్నారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా ఎన్నికల బరిలో 83 మంది ఉన్నారు.

పార్లమెంట్ అభ్యర్థులు 12 మంది..

బీఎస్పీ నుంచి పరమట గణేశ్వరరావు(ఏనుగు), కాంగ్రెస్ పార్టీ నుంచి గిడుగు రుద్రరాజు(హస్తం), వైసీపీ నుంచి డాక్టర్ గూడూరి శ్రీనివాస్(సీలింగ్ ఫ్యాన్), బీజేపీ నుంచి దగ్గుబాటి పురందేశ్వరి(కమలం), నవరంగ్ కాంగ్రెస్ నుంచి బత్తుల బలరామకృష్ణ(బకెట్), రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ నుంచి మేడా శ్రీనివాస్(గ్యాస్ సిలిండర్), జైభారత్ నేషనల్ పార్టీ నుంచి మోహనరావు శింగులూరి(బ్యాటరీ టార్చి), స్వతంత్ర అభ్యర్థులు బొమ్మనబోయిన వీఎస్‌ఆర్ మూర్తి(బ్యాట్స్‌మెన్), భానుచందర్ కురువేళ్ల(క్యాలీఫ్లవర్), డాక్టర్ మెడిసి రత్నారావు ఆలియాస్ వినయ్(గరాటు), సాళోపంతుల రాఘవేంద్రరావు(సీసీ కెమెరా) పోటీలో ఉన్నారు.

రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ అభ్యర్థులు..

రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం టీడీపీ నుంచి ఆదిరెడ్డి శ్రీనివాస్(సైకిల్), కాంగ్రెస్ నుంచి బోడా వెంకట్(హస్తం), మార్గాని భరత్‌రామ్(సీలింగ్ ఫ్యాన్), బీఎస్పీ నుంచి సురేఖ పరమట (ఏనుగు), జైభారత్ నేషనల్ పార్టీ నుంచి బి.కష్ణ చైతన్య(బ్యాటరీ టార్చి), రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ నుంచి మేడా శ్రీనివాస్ (గాజు గ్లాసు), పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి యనమదల మోహన్‌బాబు(టెలివిజన్), జనవాహిని పార్టీ నుంచి వేమన గణేష్(ఉంగరం), లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నుంచి వంగూరి విజయసత్య(బావి), స్వతంత్ర అభ్యర్థి బేతాల వెంకటేశ్వరరావు (విజిల్) పోటీలో ఉన్నారు.

రాజమహేంద్రవరం రూరల్‌లో..

ఏడుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. బీఎస్పీ నుంచి కొండవల్లి సూరిబాబు(ఏనుగు), వైసీపీ నుంచి చెల్లుబోయిన గోపాలకృష్ణ(సీలింగ్ ఫ్యాన్), టీడీపీ నుంచి గోరంట్ల బుచ్చయ్యచౌదరి(సైకిల్), కాంగ్రెస్‌పార్టీ నుంచి బాలేపల్లి మురళీధరరావు(హస్తం), భారత చైతన్య యువజన పార్టీ నుంచి దుగ్గిరాల శ్రీదేవి (గన్నాకిసాన్), జైభారత్ నేషనల్‌పార్టీనుంచి మన్నవ రఘురామ్ (బ్యాటరీటార్చి),స్వతంత్రఅభ్యర్థి సీహెచ్ పవన్‌కుమార్(వజ్రం) పోటీలో ఉన్నారు.

అనపర్తి నియోజకవర్గంలో..

9మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎల్లా శ్రీనివాసరావు(హస్తం), బీఎస్పీ నుంచి కొల్లం శ్రీను(ఏనుగు), బీజేపీ నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి(కమలం), వైసీపీ నుంచి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి(సీలింగ్ ఫ్యాన్), అఖిల భారతీయ జనసంఘ్ పార్టీ నుంచి కొవ్వూరి శివానంద రెడ్డి (సితార), జై భీమ్ రావు భారత్ పార్టీ నుంచి గంగాధరం లింగం(కోటు), లిబరేషన్ కాంగ్రెస్ నుంచి షేక్ సర్దార్ హుస్సేన్(బావి), స్వతంత్ర అభ్యర్థులు చెల్లే శ్రీను(కుండ), పులగం సూర్రెడ్డి (గ్యాస్ సిలిండర్) పోటీలో ఉన్నారు.

రాజానగరం నియోజకవర్గంలో..

12 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వైసీపీ నుంచి జక్కంపూడి రాజా(సీలింగ్ ఫ్యాన్), ముండ్రు వెంకటశ్రీనివాస్ (పెదబాబు) (హస్తం), బీఎస్పీ నుంచి యల్లమిల్లి రవికుమార్(ఏనుగు), రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ నుంచి కొత్తపల్లి భాస్కరరామం(గ్యాస్ సిలిండర్), జనసేన పార్టీ నుంచి బత్తుల బలరామకృష్ణ(గాజుగ్లాస్), జాతీయ జనసేన పార్టీ నుంచి బత్తుల బలరామకృష్ణ(పెన్‌స్టాండ్), నవరంగ్ పార్టీ నుంచి బత్తుల బలరామకృష్ణ(బకెట్), ఇండియా ప్రజా బందు పార్టీ నుంచి పి.సత్యనారాయణ (బ్యాటరీ టార్చి), స్వతంత్ర అభ్యర్థులు ఆనందకుమార్ బర్రె (బీరువా), కుసుమే గాంధీ (స్టూల్), బత్తుల వెంకటలక్ష్మి (రూమ్ కూలర్) పోటీలో ఉన్నారు.

కొవ్వూరు నియోజకవర్గంలో..

11మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి అరిగెల అరుణకుమారి(హస్తం), వైసీపీ నుంచి తలారి వెంకట్రావు(సీలింగ్ ఫ్యాన్), టీడీపీ నుంచి ముప్పిడి వెంకటేశ్వరరావు(సైకిల్), లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నుంచి బొంతా శ్యామ్ రవిప్రకాష్(బావి), నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి ముప్పిడి శేఖర్ బాబు(బకెట్), రాష్ట్రీయ ప్రజాకాంగ్రెస్ నుంచి కొయ్య శేఖర్‌బాబు(గ్లాస్ టంబ్లర్), స్వతంత్ర అభ్యర్థులు ఉబా శ్రీకాంత్ (కరెంట్ స్తంభం), కమల ఆరుగొలను(ప్రెజర్ కుక్కర్), కొక్కిరిపాటి చినబాబు(గ్యాస్ సిలిండర్), తాతపూడిప్రవీణ్(బ్యాట్), బొంతా కిషోర్ (విజిల్) పోటీలో ఉన్నారు.

నిడదవోలు నియోజకవర్గంలో..

12 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. బీఎస్పీ నుంచి గుమ్మాపు చిత్రసీమ(ఏనుగు), కాంగ్రెస్ పార్టీ నుంచి పెద్దిరెడ్డి సుబ్బారావు(హస్తం), వైసీపీ నుంచి జి.శ్రీనివాస్ నాయుడు(సీలింగ్ ఫ్యాన్), ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి కస్తూరి సత్యప్రసాద్(సింహం), జాతీయ జనసేన పార్టీ నుంచి కొట్టియడ దుర్గ (పెన్‌స్టాండ్), నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి కంచర్ల దుర్గేష్ (బకెట్), జనసేన పార్టీ నుంచి కందుల దుర్గేష్(గాజు గ్లాస్), జై భారత్ నేషనల్ పార్టీ నుంచి పులమల వీరభద్రం (బ్యాటరీ టార్చి), భారతీయ పిరమిడ్ పార్టీ నుంచి ముక్కామల అన్నవరప్రసాద్(టెలివిజన్), స్వతంత్ర అభ్యర్థులు అరిగెల సత్యవరప్రసాద్ (పండ్లబుట్ట), గిద్దా వెంకటేశ్వరనాయుడు (కరెంటు స్తంభం), గిద్దా శ్రీనివాసనాయుడు (హాకీస్టిక్ అండ్ బాల్) పోటీలో ఉన్నారు.

గోపాలపురం నియోజకవర్గంలో..

10 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వైసీపీ నుంచి తానేటి వనిత (సీలింగ్ ఫ్యాన్), బీఎస్పీ నుంచి భారతరావు సిర్రా(ఏనుగు), టీడీపీ నుంచి మద్దిపాటి వెంకటరాజు(సైకిల్), కాంగ్రెస్ నుంచి సోడదాసి మార్టిన్ లూథర్ (హస్తం), జాతీయ జనసేన పార్టీ నుంచి పెనుమాక వెంకటరత్నం(పెన్ స్టాండ్), ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి బాతుల వేణు(సింహం), జైభారత్ నేషనల్ పార్టీ నుంచి శ్రీనివాసరావు ములగాల(బ్యాటరీ టార్చి), స్వతంత్ర అభ్యర్థులు దొడ్డిగర్ల నాగార్జున(టీవీ రిమోట్), ముక్కవల్లి వెంకటరమణ(రంపం), రాపాక హరిష్‌కుమార్(గౌన్) పోటీలో ఉన్నారు.


మా టైమ్ వచ్చింది : రాజమహేంద్రవరంలో పోలింగ్ సామగ్రితో బయలుదేరిన సిబ్బంది

నేడు ఓటెత్తండి!


ఈవీఎం మిషన్‌పై సిబ్బందికి అవగాహన

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మీ ఓటే వజ్రాయుధం.. ఒక్కసారి నొక్కితే ఐదేళ్లు మిమ్మల్ని పాలించే అవకాశం..ఆ అవకాశాన్ని జారవిడుచుకోవొద్దు..మీ తెగువ చూపండి.. మీకు నచ్చిన.. మీరు మెచ్చిన అభ్యర్థిని ఎన్నుకోండి..ప్రజల కోసం.. ప్రజల చేత.. ప్రజలే ఎన్నుకొనే ప్రభుత్వ విధానమే ప్రజాస్వామ్యం. దీనినే ఆంగ్లంలో డెమొక్రసీ అంటారు. ఇది డెమోక్రటియా అనే గ్రీకు పదం నుంచి వచ్చింది. డెమోస్ అంటే ప్రజలు.. క్రాటోస్ అంటే పరిపాలన అని అర్థం. 'అందరూ స్వాతంత్ర్యం అనుభవించడం, ప్రతి ఒక్కరూ సమానం' ఇవి ప్రజాస్వామ్య ముఖ్య నియమాలు. మరి ఇవి నెరవేరాలంటే ఒకే ఆయుధం 'ఓటు'. ఈ హక్కు వినియోగించుకునే రోజే పోలింగ్ రోజు (ఈరోజు). అయితే అంతటి విలువైన ఓటుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఐదేళ్ల పాటు ఇబ్బందులకు గురవుతున్నారు.పాలకులను ఎన్నుకునే అవకాశాన్ని జార విడుచుకొని బేజారవుతున్నారు.నోట్లు, బహుమతులు వంటి వాటి కి లొంగి అనుభవం లేని వాళ్లను, దగా కోర్లను నెత్తిన ఎక్కించుకొని నలిగిపోతున్నారు.దీనికి ఈ సారి స్వస్తి పలుకుదాం.ఓటుపై అలిగితే రాజ్యాంగం

ఉదయం 7 గంటల నుంచే పోలింగ్

ఇచ్చిన మహత్తర అవకాశాన్ని జార విడుస్తున్నట్టే.. లెగండి.. పదండి..ఓటెత్తండి. మన ఆకాంక్షలను నెరవేర్చే నాయకులను పాలకులుగాచేసుకుందాం. మరో ఐదేళ్ల యాతన పడకుండా జాగ్రత్త పడదాం.ప్రజాస్వామ్యం



2014,2019 ఎన్నికల్లో పోలింగ్

నియోజకవర్గం	2014	2019
రాజమహేంద్రవరం సిటీ	69.47	66.19
రాజమహేంద్రవరం రూరల్	73.97	74.21
కొవ్వూరు	85.28	86.46
నిడదవోలు	85.72	82.70
గోపాలపురం	86.96	85.92
అనపర్తి	85.98	87.44
రాజానగరం	85.93	87.83
సరాసరి	81.90	81.53

ఓడిపోకుండా ఓటుతో కాపాడుకుందాం.

వారి తీరు గర్హనీయం



జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలైన రాజమహేంద్రవరం సిటీ, రూరల్, రాజానగరం, అనపర్తి, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురంలో గత రెండు దఫాల్లో(2014, 2019) ఓటింగ్ 90 శాతం దాటలేదు.సరాసరి చూస్తే 2014లో 81.90 శాతం, 2019లో 81.53 శాతం మాత్రమే ఓటింగ్ నమోదైంది. ఓటు వేయని సు మారు 18 శాతం మంది ఇంటికే పరి మితమయ్యారు. పోలింగ్ రోజున ఓటు వేయడా నికి ఎన్నికల సం ఘం అన్ని ఏర్పాట్లూ చేస్తోంది. కానీ లక్షల మంది ఓటింగ్‌కి దూ రమై ప్రజాస్వామ్యాన్ని అప హాస్యం చేస్తున్నారనడంలో సందే హం లేదు. జిల్లాలోని రాజమ హేంద్రవరం సిటీ నియోజకవర్గ ప్రజలు మే ల్కోవాల్సిన అవసరం కనిపిస్తోంది. గత రెండు దఫాల ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో ఇక్క డే అతి తక్కువ ఓటింగ్ నమోదైంది. గ్రా మా ల్లో ప్రజలు చైతన్యంతో ఉంటే నగర ప్రజలు ఓటు చులకనగా చూస్తున్నారనే వాదన ఉంది.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. సోమ వారం ఉదయం 7 గంటల నుంచి సాయం త్రం 6 గంటల వరకూ పోలింగ్ జరగనుంది. ఈ మేరకు 1577 పోలింగ్ కేంద్రాలు ఏర్పా టు చేశారు. ఏడు నియోజకవర్గాల్లో 71 మంది పోటీపడుతున్నారు. ఎంపీ అభ్యర్థులు 12 మంది బరిలో ఉన్నారు. ఇప్పటికే జిల్లాలో 16,169 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేశారు. జిల్లాలో మొత్తం 16,23,149 మంది ఓటర్లు ఉన్నారు. మహిళలు 8,30,735 మంది ఉండగా, పురుషులు 7,92,317 మంది, ఇతరులు 97 మంది ఉన్నారు. వీరిలో పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు, హోం ఓటింగ్‌ను మినహాయిస్తే మిగతా వారంతా ఓటు వేయవలసి ఉంది. కొత్తగా ఓటు హక్కు పొందిన యువత 40,509 మంది ఉన్నారు. సోమవారం ఉదయం 5.30 గంటలకే మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. ఇది రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో అధికారులు నిర్వహిస్తారు. ప్రతి రెండు గంటలకు పోలింగైన ఓట్ల శాతాలు ప్రకటిస్తారు. పీడీఎంఎస్ యాప్ ద్వారా పీవో, ఏపీవోలు ప్రతి రెండుగంటలకు పోలింగ్ శాతాలు అప్‌లోడ్ చేస్తారు.

ప్రతి ఒక్కరూ ఓటెయ్యాలి : కలెక్టర్

ఓటేయడం మన సామాజిక బాధ్యత. నేనూ ఓటేస్తున్నా. కంబాలపేటలోని ఆనందరీజెన్సీ ఎదురుగా ఉన్న చున్నీ లాల్ జాజు రోటరీ మునిసిపల్ కార్పొ రేషన్ స్కూల్‌లో నాకు ఓటు ఉంది. ఎన్నికలనేవి ప్రజాస్వామ్య పండుగ. సోమవారం ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాల యాలన్నింటికీ సెలవు.ప్రతి ఒక్కరూ ఓటెయ్యాలి. పోలింగ్ ముగిసే సమ యానికి క్యూలో ఉన్న ఓటర్లందరికీ ఓటు వేయడానికి అనుమతి ఉంటుం ది.జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంది. పోలింగ్ కేంద్రాల్లో మొబైల్ ఫోన్లు నిషేధించాం. శనివారం నుంచి సోమవారం సాయంత్రం వరకూ 48 గంటలు ఎక్కడా మద్యం అమ్మకాలు లేకుండా నిషేధించాం. జిల్లాలో 164 ప్రాంతాల్లో 375 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో 434 మంది మైక్రో అబ్జర్వర్లు, 151 మంది సెక్టార్ అధికారులు, 151 రూట్ అధికారులు ఉన్నారు.24 ఎంసీసీ బృందాలు, 67 మంది ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 69 గణాంకాల బృందాలు 24 వీడియో సర్వేలెన్స్ బృందాలు, 25 వీడియో చిత్రీకరణ బృందాలు, 16 అకౌంటింగ్ బృందాలు ఉన్నాయి. ఏ సమస్య తలెత్తినా జిల్లా కంట్రోలు రూమ్ 18904252540 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలి.. ఓటర్ల సమాచారానికి 1950 నెంబరులో సంప్రదించవచ్చు. ఓటర్లు 12 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించి ఓటేయవచ్చు.

1700 మంది పోలీసులు : ఎస్పీ

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఎన్నికలకు రెండు నెలల ముందు నుంచే సన్నద్ధత మొదలుపెట్టాం.పక్కా ప్రణాళికతో బందోబస్తు ఏర్పాట్లు చేశాం. శాంతియుతంగా పోలింగ్ జరగడానికి అన్ని ఏర్పాట్లూ చేశాం.. సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులు పెట్టి ఇప్పటి వరకూ రూ.23 కోట్ల విలువ చేసే బంగారం, నగదు, మద్యం, ఫ్రీబీస్‌ను సీజ్ చేశాం. ఓటరుకు రక్షణ అవసరమైతే ప్రత్యే కంగా ఏర్పాటు చేసిన పోలీస్ కంట్రోల్ రూం నెం.0883 2441480కి లేదా డయల్ 100, 112కి ఫోన్ చేస్తే నిమిషాల్లో వారి వద్దకు చేరుకుంటాం. లేదా దగ్గరలోని పోలీసులను సంప్రదించాలి. జిల్లాలో 1700 మంది పోలీసులు, 10 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలతో భద్రత ఏర్పాట్లు చేశాం.ఇప్పటికే 1098 మంది రౌడీషీటర్లను, 173 మంది గత ఎన్నికల్లో నిందితులు /నేరస్తులను బైండోవర్ చేశాం. 178 లైసెన్సుడు వెపన్స్ స్వాధీనం చేసుకున్నాం.నేను 2017 బ్యాచ్ ఐపీఎస్.ఎస్పీగా సార్వత్రిక ఎన్నికల్లో ఒక జిల్లా బాధ్యతలు చూడడం తొలిసారి. మా అధికారులు, సిబ్బందితో పూర్తి సమన్వయంతో ఎన్నికలకు సన్నద్ధమయ్యాం.

మేమూ..రెడీ!



రాజమహేంద్రవరం సిటీ, మే 12 :ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన ఎన్నికలకు సర్వం సిద్ధమైంది.. ఓటు వేయడానికి అటు ప్రజలు సిద్ధంగా ఉంటే.. ఇటు ఓటు వేయించడానికి అధికారులు సన్నద్ధమయ్యారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల సామగ్రిని ఆయా నియో జకవర్గ కేంద్రాల్లో సిబ్బందికి ఆదివారం అందించారు. సామగ్రిని స్వాధీనం చేసుకుని ఆయా నియోజకవర్గాలకు సిబ్బంది బయలుదేరి వెళ్లారు. ఎన్నికల సిబ్బందికి ఈవీఎం, వీవీ ప్యాట్స్‌పై అవగాహన కల్పించారు. ప్రత్యేక వాహనాల్లో సిబ్బందిని ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల పోలింగ్ సామగ్రి తరలింపు ప్రక్రియ ఆదివారం జరిగింది.జిల్లా ఎన్నికల అధికారిణి డాక్టర్ కే మాధవీలత , సిటీ ఆర్‌వో దినేష్ కుమార్ ఈ ప్రక్రియను పరిశీలించారు. నగరంలో 90 లోకేషన్లలో ఉన్న 237 పోలింగ్ కేంద్రాల్లో 2,67,484 మంది ఓటర్లు తమ ఓటు హక్కునువినియోగించుకోబోతున్నారు. ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్స్ , బ్యాలెట్ యూనిట్స్ తరలింపు పకడ్బందీగా నిర్వహించినట్టు తెలిపారు.


ఇదీ మీదే : ఈవీఎం మిషన్లను అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత


పోలింగ్ విధులు కేటాయిస్తున్న కొవ్వూరు సబ్ కలెక్టర్


అంతా ఓకేనా : పోలింగ్ కేంద్రాలు పరిశీలిస్తున్న ఎస్పీ

8
బరిలో నిలిచింది వీరే..
దోచుకున్న సొమ్ము తీయండి!
ట్రావెల్స్ బస్ ఢీకొని చిన్నారి మృతి
నకిలీ మద్యం తయారీ ముఠా గుట్టురట్టు

ఇలాగైతే ఓటెలా!


పోలింగ్ కేంద్రం వద్ద సమస్య ఉన్నా అధికారులకు కానరాలేదు.. అక్కడే ఏర్పాట్లు చేసేశారు.. ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి దేవరపల్లి మండలం 60వ పోలింగ్ కేంద్రం వద్ద నీరు నిలిచిపోయింది. దీంతోఓటర్లకు ఇబ్బందులు తప్పవు.



గోపాలపురంలో బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం

నిడదవోలులో మదర్స్ డే

నిడదవోలు, మే 12: నిడదవోలులో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మదర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా గన్నాబత్తుల రామారావు ఆర్థిక సహాయంతో పేద మహిళలకు, తల్లులకు చీరలు, స్వీట్స్ పంచారు. కొంతమంది మాతృమూర్తులను సత్కరించారు. కార్యక్రమంలో రొటేయన్స్ గన్నాబత్తుల రామారవు, జి.నందకిశోర్, గుంటిపల్లి శివకమార్, పొన్న సుబ్రహ్మణ్య శర్మ, జి.భాగ్యలక్ష్మి, కె.లక్ష్మి, బలగం అప్పారావు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఎన్నికల సిబ్బంది

బరిలో నిలిచింది వీరే..

» 7 నియోజకవర్గాల్లో 71 మంది ఎమ్మెల్యే అభ్యర్థులు..

» 12 మంది పార్లమెంట్ అభ్యర్థులు..

రాజమహేంద్రవరం సిటీ, మే 12: తూర్పుగోదావరి జిల్లాలో సోమవారం సార్వత్రిక ఎన్నికలు-2024 పోలింగ్ జరుగనున్నది. అందుకోసం అన్ని ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, అసెంబ్లీ ఆర్‌వోలు పూర్తి చేశారు. 7 నియోజకవర్గాల్లో పోటీలో 71 మంది ఎమ్మెల్యే అభ్యర్థులు, 12 మంది ఎంపీ అభ్యర్థులు పోటీపడుతున్నారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా ఎన్నికల బరిలో 83 మంది ఉన్నారు.

పార్లమెంట్ అభ్యర్థులు 12 మంది..



బీఎస్పీ నుంచి పరమట గణేశ్వరరావు(ఏనుగు), కాంగ్రెస్ పార్టీ నుంచి గిడుగు రుద్రరాజు(హస్తం), వైసీపీ నుంచి డాక్టర్ గూడూరి శ్రీనివాస్(సీలింగ్ ఫ్యాన్), బీజేపీ నుంచి దగ్గుబాటి పురందేశ్వరి(కమలం), నవరంగ్ కాంగ్రెస్ నుంచి బత్తుల బలరామకృష్ణ(బకెట్), రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ నుంచి మేడా శ్రీనివాస్(గ్యాస్ సిలిండర్), జైభారత్ నేషనల్ పార్టీ నుంచి మోహనరావు శింగులూరి(బ్యాటరీ టార్చి), స్వతంత్ర అభ్యర్థులు బొమ్మన బోయిన వీఎస్ఆర్ మూర్తి(బ్యాట్స్‌మెన్), భానుచందర్ కురువేళ్ల(క్యాలీఫ్లవర్), డాక్టర్ మెడిసి రత్నారావు ఆలియాస్ వినయ్(గరాటు), సాళోపంతుల రామవేంద్రరావు(సీసీ కెమెరా) పోటీలో ఉన్నారు.

రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ అభ్యర్థులు..



రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం టీడీపీ నుంచి ఆదిరెడ్డి శ్రీనివాస్(సైకిల్), కాంగ్రెస్ నుంచి బోడా వెంకట్(హస్తం), మార్గాని భరత్‌రామ్(సీలింగ్ ఫ్యాన్), బీఎస్పీ నుంచి సురేఖ పరమట (ఏనుగు), జైభారత్ నేషనల్ పార్టీ నుంచి బి.కష్ట చైతన్య(బ్యాటరీ టార్చి), రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ నుంచి మేడా శ్రీనివాస్ (గాజు గ్లాసు), పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి యనమదల మోహన్‌బాబు(టెలివిజన్), జనవాహిని పార్టీ నుంచి వేమన గణేష్(ఉంగరం), లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నుంచి వంగూరి విజయసత్య(బావి), స్వతంత్ర అభ్యర్థి బేతాల వెంకటేశ్వరరావు (విజిల్) పోటీలో ఉన్నారు.

రాజమహేంద్రవరం రూరల్‌లో..



ఏడుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. బీఎస్పీ నుంచి కొండవల్లి సూరిబాబు(ఏనుగు), వైసీపీ నుంచి చెల్లుబోయిన గోపాలకృష్ణ(సీలింగ్ ఫ్యాన్), టీడీపీ నుంచి గోరంట్ల బుచ్చయ్యచౌదరి(సైకిల్), కాంగ్రెస్ పార్టీ నుంచి బాలేపల్లి మురళీధరరావు(హస్తం), భారత చైతన్య యువజన పార్టీ నుంచి దుగ్గిరాల శ్రీదేవి (గన్నా కిసాన్), జైభారత్ నేషనల్ పార్టీ నుంచి మన్నవ రఘురామ్(బ్యాటరీ టార్చి), స్వతంత్ర అభ్యర్థి చింతలపాటి పవన్‌కుమార్(వజ్రం) పోటీలో ఉన్నారు.

అనపర్తి నియోజకవర్గంలో..



9మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎల్లా శ్రీనివాస రావు(హస్తం), బీఎస్పీ నుంచి కొల్లం శ్రీను(ఏనుగు), బీజేపీ నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి(కమలం), వైసీపీ నుంచి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి(సీ లింగ్ ఫ్యాన్), అఖిల భారతీయ జనసంఘ్ పార్టీ నుంచి కొప్పూరి శివానందరెడ్డి (సితార), జై భీమ్ రావు భారత్ పార్టీ నుంచి గంగాధరం లింగం(కోటు), లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నుంచి షేక్ సర్దార్ హుస్సేన్(బావి), స్వతంత్ర అభ్యర్థులు చెల్లే శ్రీను(కుండ), పులగం సూర్రెడ్డి (గ్యాస్ సిలిండర్) పోటీలో ఉన్నారు.

రాజానగరం నియోజవర్గంలో..



12 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వైసీపీ నుంచి జక్కంపూడి రాజా(సీలింగ్ ఫ్యాన్), ముండ్రు వెంకటశ్రీనివాస్ (పెద బాబు) (హస్తం), బీఎస్పీ నుంచి యల్లమిల్లి రవికుమార్(ఏనుగు), రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ నుంచి కొత్తపల్లి భాస్కరరామం(గ్యాస్ సిలిండర్), జనసేన పార్టీ నుంచి బత్తుల బలరామకృష్ణ(గాజుగ్లాస్), జాతీయ జనసేన పార్టీ నుంచి బత్తుల బలరామకృష్ణ(పెన్‌స్టాండ్), నవరంగ్ పార్టీ నుంచి బత్తుల బలరామకృష్ణ(బకెట్), ఇండియా ప్రజా బందు పార్టీ నుంచి పి.సత్యనారాయణ (బ్యాటరీ టార్చి), స్వతంత్ర అభ్యర్థులు ఆనందకుమార్ బర్రె (బీరువా), కుసుమే గాంధీ (స్టూల్), బత్తుల వెంకటలక్ష్మి (రూమ్ కూలర్) పోటీలో ఉన్నారు.

కొవ్వూరు నియోజకవర్గంలో..



11మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి అరిగెల అరుణకుమారి(హస్తం), వైసీపీ నుంచి తలారి వెంకట్రావు(సీలింగ్ ఫ్యాన్), టీడీపీ నుంచి ముప్పిడి వెంకటేశ్వరరావు(సైకిల్), లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నుంచి బొంతా శ్యామ్ రవిప్రకాష్(బావి), నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి ముప్పిడి శేఖర్ బాబు(బకెట్), రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ నుంచి కొయ్య శేఖర్‌బాబు(గ్లాస్ టంబ్లర్), స్వతంత్ర అభ్యర్థులు ఉబా శ్రీకాంత్ (కరెంట్ స్తంభం), కమల ఆరుగొలను(ప్రెజర్ కుక్కర్), కొక్కిరిపాటి చినబాబు(గ్యాస్ సిలిండర్), తాతపూడి ప్రవీణ్(బ్యాట్), బొంతా కిషోర్ (విజిల్) పోటీలో ఉన్నరు.

నిడదవోలు నియోజకవర్గంలో..



12 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. బీఎస్పీ నుంచి గుమ్మాపు చిత్రసీమ(ఏనుగు), కాంగ్రెస్ పార్టీ నుంచి పెద్దిరెడ్డి సుబ్బారావు(హస్తం), వైసీపీ నుంచి జి.శ్రీనివాస్ నాయుడు(సీలింగ్ ఫ్యాన్), ఆల్ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి కస్తూరి సత్యప్రసాద్(సింహం), జాతీయ జనసేన పార్టీ నుంచి కొట్టియడ దుర్గ (పెన్‌స్టాండ్), నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి కంచర్ల దుర్గేష్ (బకెట్), జనసేన పార్టీ నుంచి కందుల దుర్గేష్(గాజు గ్లాస్), జై భారత్ నేషనల్ పార్టీ నుంచి పులమల వీరభద్రం (బ్యాటరీ టార్చి), భారతీయ పిరమిడ్ పార్టీ నుంచి ముక్కామల అన్నవరప్రసాద్(టెలివిజన్), స్వతంత్ర అభ్యర్థులు అరిగెల సత్యవరప్రసాద్ (పండ్లబుట్ట), గిద్దా వెంకటేశ్వరనాయుడు (కరెంటు స్తంభం), గిద్దా శ్రీనివాసనాయుడు (హాకీస్టిక్ అండ్ బాల్) పోటీలో ఉన్నారు.

గోపాలపురం నియోజకవర్గంలో..



10 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వైసీపీ నుంచి తానేటి వనిత (సీలింగ్ ఫ్యాన్), బీఎస్పీ నుంచి భారతరావు సిర్రా (ఏనుగు), టీడీపీ నుంచి మద్దిపాటి వెంకటరాజు(సైకిల్), కాంగ్రెస్ నుంచి సోడదాసి మార్టిన్ లూథర్(హస్తం), జాతీయ జనసేన పార్టీ నుంచి పెనుమాక వెంకటరత్నం(పెన్‌స్టాండ్), ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి బాతుల వేణు(సింహం), జైభారత్ నేషనల్ పార్టీ నుంచి శ్రీనివాసరావు ములగాల(బ్యాటరీ టార్చి), స్వతంత్ర అభ్యర్థులు దొడ్డిగర్ల నాగార్జున(టీవీ రిమోట్), ముక్కవల్లి వెంకటరమణ(రంపం), రాపాక హరిష్‌కుమార్(గౌన్) పోటీలో ఉన్నారు.



కొవ్వూరులో అధికారులకు సూచనలిస్తున్న రిటర్నింగ్ అధికారి శ్రీవాస్తవ



పోలింగ్ సామగ్రితో కేంద్రాలకు బయలు దేరిన సిబ్బంది



తాళ్లపూడిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది

నేడే పోలింగ్

» కొవ్వూరు నియోజకవర్గంలో 1,84,136 మంది ఓటర్లు

» మొత్తం 176 పోలింగ్ కేంద్రాలు..53 సమస్యాత్మకం

» పోలింగ్‌బూత్‌ల వారీగా సామగ్రి పంపిణీ

» రిటర్నింగ్ అధికారి, సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ

కొవ్వూరు, మే 12: సాధారణ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 13న నిర్వహించే పోలింగ్ రోజు ఓటర్లు తమ అమూల్యమైన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. కొవ్వూరులోని సంస్కృత పాఠశాల ప్రాంగణంలో నియోజకవర్గంలోని 176 పోలింగ్ కేంద్రాలకు సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆదివారం ఏర్పాటుచేసి పోలింగ్ కేంద్రాల వారీగా పోలింగ్ సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 7గంటల నుంచి పోలింగ్ ప్రారంభం అవుతుందన్నారు. నియోజకవర్గంలో 1,84,136 మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నారన్నారు. వారిలో పురుషులు 89743 మంది, మహిళలు 94388 మంది, ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఐదుగురు ఉన్నారన్నారు. నియోజకవర్గంలోని 101 ప్రాంతాల్లో 176 పోలింగ్ కేంద్రాలు ఉండగా 16 ప్రాంతాల్లో 35 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు. పీవోలు 203, ఏపీవోలు 198, ఓపీవోలు 759 మందిని ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో 17 మంది రూట్ అధికారులను, 17 మంది సెక్టారు అధికారులను, 3 ఎంసీసీ టీమ్స్, 9 ఎఫ్ఎస్‌టీ టీమ్స్, 9 ఎస్ఎస్‌టీ టీమ్స్, 3 వీడియో సర్వేలెన్స్, 3 వీడియో వ్యూయింగ్ టీమ్స్, 2 అకౌంటింగ్ టీమ్స్‌లు, 39 మంది మైక్రో అబ్జర్వర్స్, 176 మందిని వెబ్ కాస్టింగ్‌కు నియమించినట్టు రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు. పోలింగ్ సిబ్బందికి ఈవీఎం యంత్రాలు, వీవీ ప్యాట్‌లు, పోలింగ్ ఫ్లాట్ ఫామ్‌లు, చెక్‌లిస్ట్ అందించామన్నారు. ఈ సందర్భంగా సిబ్బందితో సబ్ కలెక్టర్ మాట్లాడుతూ 13వ తేదీ ఉదయం 5-30 గంటలకు ప్రతి పోలింగ్‌స్టేషన్‌లో బరిలో నిలిచిన అభ్యర్థుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. ఉదయం 7 గంటలకు సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రారంభించాలన్నారు.సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు భద్రత ఏర్పాటుచేశామన్నారు. పోలింగ్ సామగ్రి పంపిణీని సాధారణ ఎన్నికల పరిశీలకుడు కమల్‌కాంత్ సరోచ్ పరిశీలించారు. నియోజకవర్గంలో ఓటరుగా నమోదయిన ప్రతిఒక్కరూ ఎన్నికల కమీషన్ సూచించిన ఏదైనా ఒక గుర్తింపుకార్డు తీసుకువచ్చి తమ ఓటుహక్కు వినియోగించుకోవచ్చునన్నారు. ఎన్నికల నిబంధనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించాలన్నారు.

తాళ్లపూడిలో 44 పోలింగ్ బూత్‌లు

తాళ్లపూడి, మే 12: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండలంలో 44 పోలింగ్ బూత్‌లలో 41873 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో మహిళలు 21358 కాగా పురుషులు 20514 మంది. ఆదివారం సాయంత్రం పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్దకు సామగ్రితో వచ్చారు. 44 పోలింగ్ కేంద్రాలకు పీవో, ఏపీవో, ఓపీవోలు 264 మంది విధులు నిర్వహించనున్నారు. సీఐ జేమ్స్ ఆధ్వర్యంలో నాలుగు రూట్ మొబైల్ సిబ్బంది, 80 మంది హెడ్‌కానిస్టేబుల్స్, సీఆర్‌పీఎఫ్, సీఎస్ఎఫ్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. తహశీల్దార్ సీహెచ్ శ్రీనివాసరావు, ఎంపీడీవో టీవీవీ రమణ పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక పంచాయతీ అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు.

చాగల్లులో 50 పోలింగ్ బూత్‌లు

చాగల్లు, మే 12: సాధారణ ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు తహశీల్దార్ ఎం.సావిత్రి తెలిపారు. ఆదివారం ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలో 52,441 మంది ఓటరులుండగా స్త్రీలు 26.766 మంది, పురుషులు 25,675 మంది ఉన్నారని తెలిపారు. వీరికి 50 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. మల్లవరంలో దివ్యాంగుల కోసం ప్రత్యేక పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశామన్నారు.

సినట్లు చెప్పారు. ప్రజాస్వామ్యం విజయవంతం కోసం ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

గోపాలపురంలో 2,42,763 మంది ఓటర్లు: ఆర్వో

గోపాలపురం, మే 12: ప్రతి ఓటరు స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కేఎల్ శివజ్యోతి అన్నారు. నియోజకవర్గానికి సంబంధించి గోపాలపురంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ చేసి వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బస్సుల్లో పంపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో 2,42,763 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని, అందుకు 149 ప్రాంతాల్లో 248 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 25 రూట్ అధికారులు, 25 సెక్టార్ల అధికారులు, 207 మంది పీవోలు, 216 మంది ఏపీవోలు, 791మంది ఇతర సిబ్బందిని నియమించామన్నారు. పోలింగ్ స్టేషన్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా వెబ్‌కాస్టింగ్, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అలాగే 63మంది సూక్ష్మ పరిశీలకులు, పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తారని, 248 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇదిలా ఉండగా పోలింగ్ సిబ్బంది పీవో, ఏపీవో, ఇతర సిబ్బంది సోమవారం ఉదయం మాక్ పోలింగ్ నిర్వహించే వరకు ఈవీఎంలు ఓపెన్ చేయకూడదని, పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లును పూర్తి చేసుకోవాలని రిటర్నింగ్ అధికారి చెప్పారు. పోలింగ్ ఏజెంట్లతో మాట్లాడి ఉదయం 5.30గంటలకు నిర్వహించే మాక్ పోలింగ్‌కు ఏజెంట్లు తప్పకుండా హాజరు కావాలన్నారు. ఈవీఎంలలో ఇబ్బందులు వస్తే సెక్టోరియల్ అధికారికి తెలియజేయాలన్నారు. పోలింగ్ సిబ్బందికి వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు.

దేవరపల్లిలో 67పోలింగ్ కేంద్రాలు

దేవరపల్లి, మే 12: దేవరపల్లి మండలంలో పోలింగ్ కేంద్రాలు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలో 67పోలింగ్ కేంద్రాలున్నాయి. 60వ పోలింగ్ కేంద్రం వద్ద మోడల్ పోలింగ్ కేంద్రంగా ప్రత్యేక అలంకరణ చేశారు. అదే ప్రాంగణంలో చిన్నపాటి వర్షానికి నీరు నిలిచి బురదమయంగా మారింది. సోమవారం వర్షం పడితే ఓట్లు వేసే వారికి బయట నిలబడే వారికి ఇబ్బందులు కలిగే అవకాశం ఉన్నందున అధికారులు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు తహశీల్దార్ వైవీఎస్ ఆచార్యులు తెలిపారు.

నల్లజర్లలో 66 పోలింగ్ బూత్‌లు

నల్లజర్ల, మే 12: ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లను ఇప్పటికే సంబంధిత అధికారులు పూర్తి చేశారు. నల్లజర్లలో 155 పోలింగ్ కేంద్రాన్ని మోడల్ పోలింగ్ కేంద్రంగా ఎంపిక చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మండలంలో 66 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. మొత్త 80,388 మంది జనాభా ఉండగా 68,136 మందికి ఓటు హక్కు ఉంది. వీరిలో స్త్రీలు 34,842 మంది, పురుషులు 33,293, ట్రాన్స్‌జెండర్ ఒకరు ఉన్నారు. సోమవారం జరిగే పోలింగ్ ప్రశాతంగా జరిపించేందుకు ఎన్నికల అధికారులు ఏర్పాటు పూర్తి చేసి భారీ బందోబస్తీ నిర్వహిస్తున్నారు. అత్యంత సమస్యాత్మకంగా ఉన్న నల్లజర్ల గ్రామంలో పోలింగ్ కేంద్రాల వద్ద 100 మంది స్పెషల్ పోలీసులను ఏర్పాటు చేశారు. మిగిలిన గ్రామాల్లో సైతం పోలింగ్ కేంద్రాలు పోలీసుల ఆధీనంలో ఉన్నాయి.



దేవరపల్లిలో మోడల్‌పోలింగ్ కేంద్రం



నల్లజర్లలో ప్రత్యేకంగా అలంకరించిన మోడల్ పోలింగ్ కేంద్రం



గోపాలపురం పోలింగ్ బూత్‌కు చేరుకున్న ఎన్నికల సిబ్బంది



చాగల్లు: మల్లవరంలో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం



పోలింగ్ బూత్‌లకు బస్సులో బయలుదేరుతున్న సిబ్బంది



సెంటర్ నుంచి ఎన్నికల సామగ్రితో బయటకు వస్తున్న సిబ్బంది



సిబ్బందిని పోలింగ్‌బూత్‌లకు తీసుకెళ్లేందుకు సిద్ధం చేసిన బస్సులు



పోలింగ్ బూత్‌లకు వెళ్లేందుకు బస్సుల వద్దకు వెళ్తున్న దృశ్యం

ఉమా చోడేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

కొవ్వూరు, మే 12: కొవ్వూరులోని పాతవూరులో శ్రీ ఉమా చోడేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆలయార్చకులు కొవ్వూరుకు చెందిన వేమూరి నాగేశ్వరరావు, వరలక్ష్మి దంపతులతో ఆదివారం ప్రత్యేక పూజలు జరిపిచేశారు. గణపతిపూజ, ఏకాదశ రుద్రాబిషేకాలు, రుద్రహోమం, అమ్మవారికి కుంకుమ పూజలు, స్వామి వారికి బిల్వార్చన చేశారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. కార్యక్రమంలో వేమూరి సుందరేశ్వర్, ఫణీంద్ర, కలిగొట్ల కృష్ణారావు, గంపా కృష్ణారావు, మేడూరి ప్రసాదరావు, వై.వి.వి సత్యనారాయణమూర్తి, ముష్టి శ్రీరామచ్రంమూర్తి పాల్గొన్నారు.

ట్రావెల్ బస్సు ఢీకొని రెండేళ్ల చిన్నారి మృతి





సిద్ధూ(ఫైల్‌ఫొటో), బైక్‌ను ఢీకొన్న ట్రావెల్ బస్సు

నల్లజర్ల, మే 12: అన్న కొడుకు అంటే బాబాయ్‌కి ఎంతో మమకారం, కొడుకుకు సైతం బాబాయ్ అంటే చాలా ఇష్టం. రోజూ బైక్ ఎక్కించుకుని చక్కర్లు కొట్టడం అలవాటు. అయితే వీరి బంధాన్ని విధి వక్రీంచి బస్సు రూపంలో మృత్యువు కబలించింది. ఆదివారం నల్లజర్ల ప్రియాంక కన్వెక్షన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లి గ్రామానికి చెందిన గోన్నూరి రాజు, మరియమ్మ దంపతుల కుమారుడు సిద్ధూ(2)మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. రాజు దంపతులు సిద్ధూ తీసుకుని దూబచర్లలోని బంధువుల ఇంట శుభ కార్యక్రమానికి వచ్చారు. వారితోపాటు రాజు సోదరుడు సూర్యచంద్రరావు కూడా వచ్చాడు. నల్లజర్ల బస్టాండ్‌లో తమ బంధువులను కలిసేందుకు సిద్ధూను బైక్ ఎక్కించుకుని దూబచర్ల నుంచి వస్తుండగా నల్లజర్లలో ప్రియాంక కన్వెక్షన్ హల్ వద్ద సర్వీస్ రోడ్డులోకి వెళ్లే క్రమంలో వెనుక నుంచి ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో సిద్ధూ అక్కడిక్కడే మృతి చెందగా సూర్యచంద్రరావు తీవ్ర గాయాలు కావడంతో ఏలూరు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా రాజు దంపతులకు సిద్ధూ ఏకైక సంతానం.

దోచుకున్న డబ్బులు తీయండి!

వైసీపీ నేతలను నిలదీసిన ఓటర్లు



రాజమహేంద్రవరం, మే 12(ఆంధ్రజ్యోతి): 'ఐదేళ్లు దోచుకున్న డబ్బులు బయటకు తియ్యండి. మాకు ఎందుకు డబ్బులు ఇవ్వలేదు' ఇలా వైసీపీ అభ్యర్థులను ఓటర్లు ముఖ్యంగా మహిళలు నిలదీశారు. నెల రోజుల ముందు నుంచే కార్యకర్తల ఇళ్లకు డబ్బు కట్టలను తరలించి వైసీపీ అభ్యర్థులు పోలింగ్‌కి నాలుగు రోజుల ముందు నుంచీ పంచడం మొదలు పెట్టారు. బూత్‌ల వారీగా తమ మనుషులను నియమించి ఓటరు లిస్టు ప్రకారం ముట్టజెప్పారు. ఈ క్రమంలో కొన్ని ప్రాంతాల్లోని కొన్ని సామాజిక వర్గాలకు ఇవ్వవద్దని ఆదేశించారు. రాజమహేంద్రవరం రూరల్‌లోని కాపులకు, సిటీలోని శెట్టిబలిజ, కాపు, ముస్లీంకు, క్వారీ మార్కెట్ ఏరియాలోని బీసీలకు రూరల్‌లోని బొగ్గులదిబ్బలో ఎస్సీలకు ఇలా ఆయా ప్రాంతాల్లో కొన్ని సామాజిక వర్గాలను తప్పించారు. దీనికితోడు కిందిస్థాయి నాయకులు నొక్కుడు షురూ చేశారు. వైసీపీ అభ్యర్థులు కొన్ని రోజుల నుంచి స్థానిక కార్యకర్తలతో సర్వే చేయించుకొని డబ్బుల పంపిణీ వచ్చేసరికి వారిని పక్కన పెట్టేశారు. ఉదాహరణకు రాజమహేంద్రవరం రూరల్ వైసీపీ అభ్యర్థి వేణు తన మునుపటి నియోజకవర్గం రామచంద్రాపురం నుంచి కొందరిని తీసుకొచ్చి నగదు పంపిణీ కార్యక్రమం అప్పగించారు. అలాగే సిటీ వైసీపీ అభ్యర్థి భరత్ కూడా చేశారు. జిల్లాలోని అధికశాతం వైసీపీ అభ్యర్థులు ఇదే తీరు సాగించారు. ఇదంతా కలిసి ఓటర్లను చిర్రెత్తించింది. కొందరికి డబ్బులు ఇచ్చి మరికొందరి డబ్బులు మింగేయడంతో గొడవలు మొదలయ్యాయి. శని, ఆదివారాలకు ఇవి తీవ్ర రూపం దాల్చాయి. శనివారం రాత్రి భరత్ కార్యాలయాన్ని సుమారు 400మంది మహిళలు చుట్టుముట్టారు. అలాగే వేణు ఇంటికి రూరల్ మహిళలు వెళ్లి నిలదీశారు. దీంతో పోలీసులను రప్పించుకొని మహిళలను బెదిరించి పంపేశారు. ఆదివారం కొందరికి నగదులో సగం కోసేసి చేతిలో పెట్టి మమ అనిపించారు. ఎన్నికల్లో ఓటుకు నోటు తీసుకోవడం తప్పే అయినప్పటికీ దానిని ఓటర్ల హక్కుగా నాయకులు మార్చేశారనేది నిర్వివాదాంశం. పైగా వైసీపీ పెద్ద మొత్తంలో ఓటుకు రేటు కట్టడంతో ఇంటి ఖర్చులకు అయినా వస్తాయని సామాన్యులు ఆశపడడంలో తప్పేముందనే వాదనా లేకపోలేదు.

గోలింగేశ్వరస్వామికి లక్షపత్రి పూజలు

నిడదవోలు, మే 12: నిడదవోలులోని రాజరాజేశ్వరి సమేత గోలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం లక్షపత్రి పూజ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాకుళం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదం స్వీకరించారు.

తిమ్మరాజుపాలెంలో మజ్జిగ చలివేంద్రం

నిడదవోలు, మే 12: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ ఆలయం వద్ద ఆదివారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. అనంతరం ఆలయ హుండీ లెక్కించారు. ఆదాయం రూ.1,04,787 వచ్చింది. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు గాజుల రంగారావు, అయినీడి వెంకటకృష్ణ, ఎస్‌వీకె శర్మ, ఆలయ ఈవో హరిసూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తరలిన పోలింగ్ సిబ్బంది

నిడదవోలు, మే 12: నిడదవోలు నుంచి నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది ఆదివారం తరలివెళ్లారు. మధ్యాహ్న భోజనం అనంతరం పోలింగ్ సామగ్రితో సిబ్బంది బస్సులు ద్వారా నియోజకవర్గంలోని పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు పట్టణం, రూరల్ ప్రాంతాలకు వెళ్లారు.

నకిలీ మద్యం తయారీ గుట్టు రట్టు

● ఐదుగురి అరెస్టు ● 20 లీటర్ల నకిలీ మద్యం, రెండు బైక్‌లు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం



రంగంపేట, మే 12: మండలంలో నకిలీ మద్యం తయారు చేస్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఈబీ సీఐ ఎస్.రాంబాబు ఆదివారం తెలిపారు. రంగంపేట ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని నల్లమిల్లి, సింగంపల్లి, పెద్దాపురం మండలం ఆనూరు గ్రామాల్లో దాడులు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా నకిలీ మద్యం తయారు చేస్తున్న మామిడాల సూరిబాబు, మేడిశెట్టి సతీష్, బల్ల వీరప్రభలు, యాగా రాంబాబు, నాగులపల్లి బాబూరావులను అరెస్టు చేసి వారి నుంచి 20 లీటర్ల (ఎక్ట్రాన్యూట్రల్ ఆల్కాహాల్) నకిలీ మద్యం, ఐదు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీటి విలువ సుమారు రూ.2,25,000 ఉంటుందన్నారు. దాడుల్లో ఎస్ఐలు జె.విజయ్‌కుమార్, జి.అనిల్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారని సీఐ తెలిపారు.